# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

05.03.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 226 | పేజీలు : 10 Pages : 10 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









# సింగూర్ భద్రతపై రాజీ పడం

- త్వరలోనే స్వయంగా డ్యామ్‌ను సందర్శిస్తా
- ప్రాజెక్టుల భూసేకరణకు 5000 కోట్లు
- జూన్ 2 నాటికి భూసేకరణ పూర్తి
- పాలెం ప్రాజెక్ట్ సమస్యలను పరిష్కరిస్తా
- ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించండి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ ఆదేశాలు
- ప్రాజెక్టులపై మంత్రులు, అధికారులతో సమీక్ష

**హైదరాబాద్, మార్చి 4:** హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారమైన సింగూర్ డ్యామ్ భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో కలిసి ఆయన నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జంటనగరాలకు తాగునీటిని అందిస్తూనే పరిసర ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణ, పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని తేల్చి చెప్పారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు రాష్ట్ర

మిగతా 3 లో

## కేంద్ర జాబితాలో లేని 40 బీసీ కులాలు

- జనగణనలో వారిని కూడా చేర్చేలా చూడాలి
- సీఎస్‌ను కోరిన తెలంగాణ బీసీ కమిషన్



3

# హోంమంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ భేటీ



- ఇటీవల నక్సల్స్ లొంగుబాటు తదితర విషయాల ప్రస్తావన
- సీఎంను, డీజీపీ బృందాన్ని అభినందించిన అమిత్ షా

3

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రాత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. అమిత్ షా నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని అంతర్గత భద్రత, ముఖ్యంగా నక్సల్స్ నిర్మూలనలో సాధించిన విజయాలపై కీలక చర్చలు జరిగాయి. ఈ భేటీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో నక్సలిజం దాదాపు కనుమరుగైందని, రాష్ట్ర పోలీసుల సమర్థత వల్ల ఇది సాధ్యమైందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఈ భేటీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భద్రతా పరమైన సమన్వయం మరింత బలపడింది.



# ఐదోరోజూ పరస్పర దాడులు

- టెహ్రాన్ ప్రార్థనా మందిరంలో ఖమేనీ భౌతిక కాయం
- మూడ్రోజుల పాటు ప్రజల సందర్శనకు అనుమతి

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదోరోజైన బుధవారం మరింత తీవ్రమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు జరుపుతోంది. ఇరాన్‌లోని ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా దాడులను విస్తరించింది. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాక్ దాడులు కొనసాగిస్తోంది.

4

ఇజ్రాయిల్ దాడులకు దీటుగా ఇరాన్ బాంబులు






# 99 రోజులు

## ‘ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక’

- కార్యక్రమం విజయవంతానికి సీఎస్ రామకృష్ణారావు ఆదేశం
- నేటి నుంచి సన్నాహక సమావేశాలు

3

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న 'ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.



# తెరపైకి వారసుడు

- ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ముజ్తబా ఖమేనీ?
- ఐఆర్‌జీసీ మద్దతుతో పగ్గాలు చేపట్టిన ఖమేనీ రెండో పుత్రుడు

4

# మోడీ పర్యటనలకు దాడులకు లింకేంటి



- యుద్ధం అన్నది మా ప్రణాళికలో భాగం
- విమర్శలకు దీటుగా స్పందించిన ఇజ్రాయిల్

4

# మహిళా లోకానికి ‘ఆరోగ్య’ కానుక

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున భారీ స్క్రీనింగ్ ప్రారంభం

- 46 లక్షల మందికి ఉచిత పరీక్షలు!
- టీ డయాగ్నస్టిక్స్ ద్వారా 30 రకాల టెస్టులు
- 4 దశల్లో ఆరోగ్యశాఖ కార్యక్రమాలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

3



# యంగ్ ఇండియా స్కూల్స్ టెండర్లలో అవినీతి

- త్వరలోనే వివరాలు బయటపెడతాం
- జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను పక్కన పెట్టారు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

2





# యంగ్ ఇండియా స్కూల్స్ టెండర్లలో అవినీతి

**త్వరలోనే వివరాలు బయటపెడతాం**

**జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను పక్కన పెట్టారు**

**మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్, మార్చి 4 :** యంగ్ ఇండియా స్కూల్స్‌లో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు.. అన్ని ఆధారాలు ఉన్నాయి. త్వరలో అన్ని బయట పెడుతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ప్రభుత్వ పనితీరుపై హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. యంగ్ ఇండియా స్కూల్స్‌లో ఎవరికి ఎక్కువ టెండర్లు ఇచ్చారో అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. పరిపాలనలో ముఖ్యమంత్రికి పట్టు రావడం లేదని.. మేము ప్రతిపక్షంగా సక్సెస్ అయ్యామని పేర్కొన్నారు. ఖమ్మంకు కేటీఆర్ వెళ్లారు.. ఇప్పుడు స్థలాలు ఇస్తాం.. ఇండ్లు కట్టిస్తాం అన్నారు. నేను శారదా పీఠం వెళ్లాను.. అది ఆపుతున్నాం అన్నారు. దేవాదుల ప్రాజెక్టు వెళ్లాం. వెంటనే ముఖ్యమంత్రి కూడా వెళ్లారు. హెల్త్ సిటీకి వెళ్లాం ప్రతి దానికి మేము వెళ్లాక స్పందిస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను గాలికి వదిలేశారని.. మేము ఉన్నప్పుడు ప్రత్యేక జీవో ఇచ్చాం. ఉద్యోగులకు ఎలా ఉండేదో అలానే జర్నలిస్టులకు ఉండేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మేనల్లుడి మనుషులు నియో పోలీస్‌లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్‌కు మాత్రమే నిబంధనలుండగా ఫిక్స్డ్ క్రషింగ్ ప్లాంట్ నియోపోలీస్‌లో పెట్టారు. ల్యాండ్ లీజుకు ఇస్తే 6 నుంచి 7 శాతం ఫీజు కట్టాలి. లెటర్‌లో పది ఎకరాలు ఇస్తే 15 ఎకరాల్లో మైనింగ్ జరుగుతోందని.. 15 లక్షల క్యూబిక్ మీటర్ల బండకు ఫీజు ఎగ్గొట్టారని హరీష్ రావు ఆరోపించారు. అక్కడ రెడీమిక్స్‌కు పర్మిషన్ లేదన్నారు.

# ఇది మనిషి సృష్టించిన పెను విషాదం

**ఇరాన్‌లో పాఠశాల బాలికల మృతిపై కేటీఆర్**



**హైదరాబాద్, మార్చి 4:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు వైమానికి దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, తన పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ప్రతిదాడులు చేస్తోంది. ఫలితంగా పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ మారణహోమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామెంట్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఓ బాలికల పాఠశాల నేలమట్టమవగా.. ఆ శిథిలాల కింద చిక్కుకుని 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ వారి అంత్యక్రియలు విషాదకరంగా జరిగాయి. ఈ నేపథ్యంలో.. 'పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు..' అని పేర్కొంటూ కేటీఆర్ ఆ మరణించిన బాలికల సామూహిక సమాధుల దృశ్యాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం ఆవశ్యకత గురించి చెబుతున్న ఉద్దేశాలు ఏవైనా ఇది మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యుద్ధం రాబోయే తరాలకు బాధను, విషాదాన్ని మాత్రమే మిగిల్చుతుందని తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

# తెలంగాణ వర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

**కామారెడ్డి, మార్చి 4:** తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థుల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఉన్న వర్సిటీలోని సౌత్ క్యాంపస్ వసతీగృహంలో మంగళరవా అర్ధరాత్రి విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. హోలీ సంబరాల అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ కొట్లాటలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వర్సిటీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థులను చెదరగొట్టారు. అనంతరం గాయపడిన వారికి చికిత్స అందించారు. వసతీ గృహం వద్దకు స్థానిక ఎస్సై ఆంజనేయులు, వార్డెన్ డాక్టర్ యాలాద్రి అక్కడకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.




# జైలు నుంచి బాల్క సుమన్ విడుదల

- క్యాతన్‌పల్లిలో మంత్రి వివేక్ గూండాగిరీ
- మీడియా ముందు బాల్క సుమన్ ఆరోపణలు



**ఆదిలాబాద్, మార్చి 4:** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సహా బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన బయటకొచ్చారు. బాల్క సుమన్‌తో పాటు రాజారెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. ఈ ఘటనలో 22 మందిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్‌కి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. ప్రజా తీర్పును వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో వికృత క్రీడ ప్రారంభించారని బాల్క సుమన్ అన్నారు. జైలు లోపల కూడా తమను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. నిన్న హోలీ, ఇవాళ నా కొడుకు పుట్టిన రోజు.. ఈ టైమ్‌లో నన్ను ఇంట్లో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని తెలిపారు. అందర్నీ కలుపుకుపోయాం తప్ప.. కక్ష సాధింపు చేయలేదని స్పష్టం చేశారు. నన్ను జైలులో పెట్టారు కదా.. ఇప్పుడు కడుపు మంట తగ్గిందని అనుకుంటున్నా అని అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఇప్పటికైనా సవ్యంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# టీజీఎస్ ఆర్టీసీలో ఘనంగా జాతీయ భద్రతా వారోత్సవాలు

- ఉద్యోగుల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం
- సంస్థ వీసీ అండ్‌ఎండీ వై. నాగిరెడ్డి



హైదరాబాద్, మార్చి 4: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో జాతీయ భద్రతా వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మార్చి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలు, వర్క్‌షాప్‌లు, ఉత్పత్తి యూనిట్లలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అన్ని విభాగాల్లో 'భద్రతా దినోత్సవాన్ని' నిర్వహించి, సిబ్బందికి భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ వీసీ & ఎండీ వై. నాగిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్పొరేషన్‌లో పనిచేసే ప్రతి ఉద్యోగి, సూపర్వైజర్ భద్రతను తమ ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని నాగిరెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యంగా బస్ డిపోలు, వర్క్‌షాప్‌లలో భారీ యంత్రాలు, వెల్డింగ్ పరికరాలు, ఇంధన నిర్వహణ వంటి క్లిష్టమైన పనులు చేసే సమయంలో కార్మికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సురక్షితమైన పని వాతావరణం ఉండటం వల్ల ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ లభించడమే కాకుండా, సంస్థ ఖ్యాతి కూడా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అట్టడుగు స్థాయి వరకు అవగాహన కల్పించేలా అన్ని గ్యారేజీలు, జోనల్ వర్క్‌షాప్‌లు మరియు బాడీ బిల్డింగ్ యూనిట్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ వారోత్సవాల ద్వారా పని ప్రదేశాల్లో యాంత్రిక గాయాలు, విద్యుత్ షాక్‌లు, అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. అలాగే వృత్తిపరమైన ఆరోగ్య సమస్యలు, రసాయన పొగలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. సురక్షితమైన పని పద్ధతుల ద్వారా సంస్థ ఆస్తులను కాపాడుతూ, ఉత్పాదకతను పెంచడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని ఎండీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈడీ (ఈ అండ్‌ఏఎం) సీహెచ్ వెంకన్నతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొని భద్రతా ప్రతిజ్ఞ చేశారు.

# నిర్ణీత గడువులోగా పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులు పూర్తి కావాలి

- ఏపీ జెన్కో ఎండీ పీ పుల్లారెడ్డి
- జల విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు పరిశీలించిన జెన్కో ఎండీ



**పోలవరం, మార్చి 4 :** పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులు నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని ఏపీ జెన్కో ఎండీ పీ పుల్లారెడ్డి అన్నారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్ట్ పూర్తి అయ్యే సమయానికి జల విద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తికి సిద్ధం కావాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనులు చేపట్టాలని నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ కు సూచించారు. పనుల పురోగతిని అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, అనుకున్న ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయో లేదో సమీక్షించాలన్నారు. బుధవారం పోలవరం జల విద్యుత్ కేంద్రం నిర్మాణ ప్రాంతాన్ని జెన్కో థర్మల్, హైడెల్ డైరెక్టర్స్ ఎం. సుజయ్ కుమార్, పీ. అశోక్ కుమార్ రెడ్డి, సివిల్ విభాగం చీఫ్ ఇంజనీర్ పీ రవీంద్ర రెడ్డి, హెచ్పీసీ చీఫ్ ఇంజనీర్ ఎస్ విశ్వేశ్వర రావు, ఎస్ఈ లు చంద్ర శేఖర్, సి హనుమ తదితరులతో కలిసి సందర్శించారు. అనంతరం జెన్కో అధికారులు, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష, జెన్కో సీఎండీ పర్యటనలో ఎం ఈ ఐ ఎల్ జాయింట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర, ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ ప్రసేన్ జిత్ మజుందార్, జెన్కో అధికారులు భీమాదానారావు, రాజ్ కుమార్, సుబ్రహ్మణ్యం, రామ్ మోహన్, రమేష్ నాయుడు, వ్యాప్కోస్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ కొలగాని మూర్తి పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్ట్ తో పాటు, జల విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఆయన వివరించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదన్నారు. తానూ కూడా ప్రాజెక్ట్ పురోగతిని ప్రత్యేక్షంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణం సమయంలో ఏవైనా అవాంతరాలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. జల విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తి అయితే రాష్ట్రంలో విద్యుత్ కొరత తీరుతుందని, పంటలు, పరిశ్రమలకు పుష్కలంగా విద్యుత్ అందించవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టుతో పాటు, జల విద్యుత్ కేంద్రం ఒకే సమయంలో పూర్తి కావాలనే పట్టుదలతో ఉన్నారని అన్నారు. అందుకు అనుగుణంగా అందరూ పని చేయాలని అన్నారు. ఇప్పటి వరకు పనులు అనుకున్న లక్ష్యం ప్రకారం జరుగుతున్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా పుల్లారెడ్డి జల విద్యుత్ కేంద్రం ఎగువ భాగం, అప్రోచ్ ఛానల్, ఇంటేక్ పూల్ , నీటితో పాటు వచ్చే తేలియాడే ఘన వ్యర్థాలను అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన ఇనుము గ్రిల్స్ పనులు, నీటి ప్రవాహాన్ని నియంత్రించి, పెన్‌స్టాక్ , స్పైరల్ కేసింగ్ వైపు మళ్లించే సివిల్ , హైడ్రో-మెకానికల్ నిర్మాణాలు , జల విద్యుత్ కేంద్రం దిగువ భాగం, భారీ యంత్ర పరికరాల దిగుమతి, నిల్వ , అమరిక కోసం కేటాయించిన విభాగం, టర్బైన్ , జనరేటర్ యూనిట్ల నిర్వహణ , మరమ్మత్తుల కోసం వినియోగించే విభాగం, విద్యుత్ ఉత్పత్తి చేసే 11 యూనిట్స్, టర్బైన్ రన్నర్‌కు సమానంగా నీరు పంపిణీ చేయడానికి రూపొందించిన ప్రవేశ భాగం, స్పైరల్ కేసింగ్ , జనరేటర్ బ్యారెల్స్ , ఎలక్ట్రికల్ ప్యానెల్స్, కంట్రోల్ సిస్టమ్స్ అనుబంధ యంత్రాల కోసం చేపట్టిన నిర్మాణాలు, టర్బైన్ ద్వారా ఉపయోగించిన నీరు తాత్కాలికంగా నిల్వ ఉండే ప్రాంతం, ఉపయోగించిన నీటిని ప్రధాన నదీ ప్రవాహంలోకి తిరిగి పంపించే కాలువ నిర్మాణం మొదలైన వాటిని సందర్శించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే ఫీజు చెల్లింపు

**హైదరాబాద్, మార్చి 4:** ఉప్పల్ నియోజకవర్గపరిధిలోని ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేయూత అందించారు. 16 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కులను బుధవారం లక్ష్మారెడ్డి నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డిని కేటీఆర్ అభినందించారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు చెక్కులు అందజేయడం నిజంగా అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సింగూర్ భద్రతపై రాజీ పడం

మొదటి పేజీ తరువాయి



అధికారుల నుంచి వచ్చిన హెచ్చరికల నేపథ్యంలో, ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సింగూర్ ప్రాజెక్టు ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, ప్లంజ్ పూల్ సమస్యలను గుర్తించినట్లు వెల్లడించిన మంత్రి, బండ్ దిగువన దాగి ఉన్న నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు, అండర్‌వాటర్ సర్వేలు నిర్వహించి రెండు మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని సూచించారు. డ్యామ్ భద్రత విషయంలో పూర్తి బలోపేతం జరిగే వరకు అధిక ప్రమాదం కలిగించే ఆపరేషన్లను నిలిపివేయాలని అధికారులను ఆదేశిస్తూ, తానే స్వయంగా త్వరలోనే ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రభుత్వం రూ. 5,000 కోట్ల నిధులను విడుదల చేయనుందని, ఈ ప్రక్రియను జూన్ 2వ తేదీలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పాలెంవాగు ప్రాజెక్టులోని గేట్లు, రెగ్యులేటర్ సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి, ఆందోల్ నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు ఉగాదిలోగా శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. సింగూర్ కాలువ లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చేయాలని, పంటల విరామం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ నిబంధనల మేరకు సింగూర్ రక్షణకు టెక్నికల్ కమిటీని నియమించాలని, ఆందోల్ పరిధిలోని చెరువుల పునరుద్ధరణ పనులను ఈ సీజన్లోనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

# హోంమంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ భేటీ

- ఇటీవల నక్సల్స్ లొంగుబాటు తదితర విషయాల ప్రస్తావన
- సీఎంను, డీజీపీ బృందాన్ని అభినందించిన అమిత్ షా



**న్యూఢిల్లీ, మార్చి 4:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. బుధవారం రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. అందుకోసం అమిత్ షా నివాసానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. సీఎం వెంట తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ ఉన్నారు. ఇటీవల పలువురు మావోయిస్టు అగ్రనేతలు దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి తదితరులు తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఈ విషయాన్ని సిఎం రేవంత్, డిజిపిలు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు వివరించినట్లు తెలుస్తోంది. తెలంగాణకు సంబంధించి నక్సల్స్ నిర్మూలన జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా సిఎం రేవంత్‌ను, డిజిపి బృందాన్ని అభినందించారు. దేశంలో మావోయిస్టులు నిర్మూలించేందుకు కేంద్రం నిర్దేశిరచుకున్న లక్ష్యం ఆపరేషన్ కగార్ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. అలాంటి వేళ.. మార్చి మొదటి వారంలో అగ్రనేతలంతా ఒకేసారి తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. అలాగే మావోయిస్ట్ పార్టీ కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు నేపాల్‌లో ఉన్నారంటూ వార్త కథనాలు వెలువడ్డాయి. ఆయన ప్రస్తుతం వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారని సదరు కథనాల్లో స్పష్టం చేశారు. ఆయన్ని స్వదేశం తీసుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారాంటూ ప్రచారం సాగుతోంది. ఇంకోవైపు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న గణపతి లొంగిపోవాలంటూ ఆయన సోదరుడు ఇప్పటికే మీడియా ద్వారా కోరిన విషయం విదితమే. ఈ మావోయిస్ట్ అగ్రనేతలు ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసులు ఎదుట లొంగిపోయారు. వీరి లొంగుబాటులో తెలంగాణ పోలీసులు అత్యంత కీలకంగా వ్యవహరించారనే ప్రచారం సాగుతోంది. అలాంటి వేళ.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో డీజీపీతోపాటు సుమతి, విజయ్ కుమార్‌లను అమిత్ షా స్వయంగా అభినందించారని తెలుస్తోంది.

# 99 రోజుల పాటు ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక

## కార్యక్రమం విజయవంతంపై సీఎస్ టెలీ కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మార్చి 4:** మార్చి 6 నుంచి ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుజిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో బుధవారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీదేవి, ప్రణాళిక శాఖ ప్రత్యేక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితరులు ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులు ప్రజాపాలన..ప్రగతి ప్రణాళిక అయిదు దశల్లో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమ నిర్వహణపై ఉమ్మడి జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్చార్జి మంత్రితో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి, ఈ సమావేశానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. ఈనెల 12 వ తేదీన ఆయా జిల్లాల్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు , సర్పంచులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని అన్నారు. ఇందుకుగాను పంచాయితీ రాజ్, మున్సిపల్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాయని అన్నారు. ఈ 99 రోజుల ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని మరోసారి తెలిపారు. దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు తగు మార్గ దర్శకాలను జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# మహిళా లోకానికి 'ఆరోగ్య' కానుక

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున భారీ స్క్రీనింగ్ ప్రారంభం
- 46 లక్షల మందికి ఉచిత పరీక్షలు!
- టీ డయాగ్నస్టిక్స్ ద్వారా 30 రకాల టెస్టులు
- 4 దశల్లో ఆరోగ్యశాఖ కార్యక్రమాలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్, మార్చి 4 :** రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ప్రారంభించాలని ఆరోగ్యశాఖ మంత్రి దావోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సెక్రటేరియట్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకూ 99 రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. హాస్పిటళ్లలో రోజువారీ వైద్య సేవలకు ఆటంకం కలగకుండా 99 డేస్ యాక్షన్ ఎ÷-లాన్ ఉండాలని సూచించారు. అధికారులు రూపొందించిన ప్రణాళికను స్వల్ప మార్పులతో మంత్రి ఆమోదించారు. మొత్తం 4 దశల్లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. తొలి దశలో మార్చి 6 నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతా శిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై దృష్టి కేంద్రీకరించనున్నారు. హాస్పిటళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, పెండింగ్ ÷ల్లె పరిష్కారం, ఆస్తుల వెరిఫికేషన్ వంటి పరిపాలనా పరమైన అంశాలను చక్కదిద్దడంతో పాటు.. క్షేత్రస్థాయిలో రక్తహీనత నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెల్ఫ్ హెల్ఫ్ గ్రూపు మహిళల హెల్త్ ప్రొ÷ల్ తయారీ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ సహకారంతో ఒక్కో మహిళకు మొత్తం 30 రకాల పరీక్షలు చేయనున్నారు. మార్చి 8 నుంచి మూడు దశల్లో సుమారు 46 లక్షల మంది మహిళలకు పరీక్షలు చేయనున్నారు. తొలి దశలో ప్రతి జిల్లా నుంచి 5 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, రెండో దశలో మరో 10 మండలాల్లో, చివరి దశలో మిగిలిన అన్ని మండలాల్లో స్క్రీనింగ్ చేపట్టనున్నారు. మొత్తం స్క్రీనింగ్‌ను 6 నెలల్లో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ప్రజాపాలన రెండో దశను ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ 15 రోజుల్లో అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, కేన్సర్ వంటి వాటిని గుర్తించేందుకు సబ్ సెంటర్ల పరిధిలో విస్తృతమైన స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తారు. జిల్లా డే కేర్ కేన్సర్ సెంటర్లలో కీమోథెరపీ సేవలను మ్యాపింగ్ చేయడంతో పాటు, డయాలసిస్ రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలు తప్పనిసరి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇక ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు సాగే మూడో దశలో అంటువ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య సన్నద్ధతపై యంత్రాంగం దృష్టి సారించనుంది. టీబీ ముక్త్ భారత్ లక్ష్యంగా టీబీ కేసులను గుర్తించడంతో పాటు.. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వడదెబ్బ, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ÷ళి 16 నుంచి జూన్ 12 వరకు నాలుగో దశలో పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించనున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మేడ్చల్ పరిధిలోని 145 అర్బన్ పీహెచ్‌సీలను పాలిక్లినిక్స్‌గా అప్‌గ్రేడ్ చేసి, స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలని మంత్రి సూచించారు. బస్తీల్లో మొబైల్ వెహికిల్స్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యం చేరువ చేయనున్నారు. ఫుడ్ సేఫ్టీ మేళాలు నిర్వహించి ప్రజల్లో కల్తీ ఆహారంపై చైతన్యం తీసుకురావాలని మంత్రి సూచించారు.





# కేంద్ర జాబితాలో లేని 40 బీసీ కులాలు

## జనగణనలో వారిని కూడా చేర్చేలా చూడాలి

## సీఎస్‌ను కోరిన తెలంగాణ బీసీ కమిషన్

**హైదరాబాద్, మార్చి 4:** తెలంగాణ రాష్ట్రంలో జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు గృహాల నమోదు జరగనుంది. ఆ తర్వాత జనాభా గణన 2027 ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 28, వరకు జరగనుంది. జనగణనలో కేంద్ర ప్రభుత్వ ఓబీసీ లిస్టులో ఉన్న తెలంగాణలోని 90 కులాల ప్రజలను మాత్రమే ఓబీసీలుగా గణనలోకి తీసుకోవడం జరుగుతోంది. తద్వారా తెలంగాణలో ఉన్న బీసీ కులాల సంఖ్యను తక్కువగా చూపెట్టే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 130 కులాలను వెనుకబడిన తరగతుల కులాలుగా గుర్తించడం జరిగింది. కాని కేంద్ర ప్రభుత్వం ఓబీసీ లిస్ట్‌లో కేవలం 90 కులాలను మాత్రమే చేర్చి 40 కులాలను చేర్చడం జరగలేదు. తద్వారా తెలంగాణలో బీసీల సంఖ్య తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉంది. బీసీ లిస్ట్‌లో లేని 40 కులాలను కూడా ఓబీసీ లిస్ట్‌లో చేర్చాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం, బీసీ కమిషన్ తరపున కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. కాని ఇప్పటివరకు దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ 40 కులాలను ఓబీసీ లిస్ట్‌లో చేర్చిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రంలో జనగణనను ప్రారంభించాలి. విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకొచ్చి తెలంగాణ రాష్టానికి చెందిన 40 బీసీ కులాలను కేంద్ర ఓబీసీ లిస్ట్‌లో చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకి ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేయడం జరిగిందని బిసి కమిషన్ తెలిపింది.


# భార్య కాపురానికి రాకపోవడంతో ఆవేదన

## పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

**పెద్దపల్లి, మార్చి 4:** కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన చెప్యాల దేవేందర్ (38) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి మంథని ప్రధాన రహదారిలో గల గుండారం గ్రామ శివారులోని పత్తి చేసులో ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ, సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి సంస్థ ఆర్జీ- 3 పరిధిలోని సెంటినరిరాలనీ నర్సరీలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి దేవేందర్ పేరపల్లిలోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే గుండారం శివారులోని ఓ పత్తి చేసులో దేవేందర్ మృతదేహం కనిపించింది. దేవేందర్ గత 15 ఏళ్ల క్రితం పేరపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వరి అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు ఆశీష్, కుమార్తె కీర్తన ఉన్నారు. భార్య, భర్త మధ్య రెండేళ్లుగా విభేదాలు జరుగుతున్నాయి . ఏడాదిగా ఇద్దరి పిల్లలతో కలిసి తన తల్లిగారింటికి మల్లేశ్వరి వెళ్లిపోయింది. అప్పటి నుండి దేవేందర్ మానసికంగా కుంగిపోయి మద్యానికి బానిసై మంగళవారం ఈ అఘాత్యానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వండి

## రాహుల్‌కు మందకృష్ణమాదిగ లేఖ



**వరంగల్, మార్చి 4:** రాజ్యసభ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

# హిందూ పండగలంటే చిన్న చూపెందుకు

## సిఎం రేవంత్‌ను ప్రశ్నించిన రాజాసింగ్



**హైదరాబాద్, మార్చి 4:** హిందూ పండుగలు, ముస్లింల పండుగల మధ్య తెలంగాణ ప్రభుత్వం తేడాలు ఎందుకు చూపిస్తోందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. అలాగే హిందూ పండగలపై చిన్నచూపెందుకని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చినట్లుగానే హిందువుల కోసం ప్రత్యేక వేడుకలు చేసేలా కాంగ్రెస్ సర్కార్ ప్రకటన చేసేలా చూడాలని కోరారు. రంజాన్ కోసం ఇఫ్తార్ మాదిరిగా హిందువుల కోసం నవరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింల ఓట్ల కోసం ఇఫ్తార్ వేడుకలను చేసే నేతలకు హిందువుల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. ముస్లింల ఓట్ల గురించి టోపీ పెట్టుకొనే రాజకీయ పార్టీలకు హిందువులు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు.




## సంపాదకీయం

# ఈ యుద్ధంతో ఆర్థిక సంక్షోభం తప్పదా?

వరుస యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్తను అతలాకుతలం చేస్తున్నాయి. భారత్ లాంటి పేదదేశం మరింత కుంగిపోయేలా చేస్తోంది. కరోనాతో మొదలైన దాడి ఇప్పుడు గల్ఫ్ యుద్ధంతో తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్పై ఇజ్రాయిల్, అమెరికాల దాడితో చమురుత సంక్షోభంతో దారుణ పరిస్థితి మొదలు కానుంది. ఇది తరవాత క్రమంగా నిత్యాసవరాలు, కూరగాయలు, మందులపై పడనుంది. అన్నింటికీ మూలం చమురు కనుక ఈ యుద్ధంతో చమురు సంక్షోభం తప్పేలా లేదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఈ యుద్ధంతో చమురు ధరలు కొండెక్కి. వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం భారీగా పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన కలుగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై ఈ యుద్ధ ప్రభావం తోణమే ప్రారంభమవుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఈ సెగ సామాన్యులకు కూడా త్వరగానే తగలబోతోంది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా సరుకు రవాణా ఆగిపోవడం ఖాయం అయ్యింది. ఏతావాతా అది మన జేబులు చల్లుపెట్టడం, ధరలపై ప్రభావం చూపడం తద్వారా మన వంటింటికి కూడా తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందనడంలో సందేహం లేదు. మనకు అవసరమైన సోయా, సన్ ఫ్లవర్ వంటి వంట నూనెలు, పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనా, బ్రెజిల్, అమెరికా నుంచి సోయా ఆయిల్, ఉక్రెయిన్, రష్యాల నుంచి సన్ ఫ్లవర్ ఆయిల్ దిగుమతవుతున్నాయి .వంట నూనెలను తీసుకొచ్చే నౌకలు సూయజ్ కెనాల్, హోర్ముజ్ జలసంధి మీదగా రావాలి. ఇరాన్ ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని మూసి వేసింది. దీంతో వీటిని తీసుకొచ్చే నౌకలు మరింత దూరం ప్రయాణించి మన రేవులకు చేరాలి. దీంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి ధరల పెరుగుదల మీద తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే ముడిచమురు దిగుమతుల ప్రభావం వల్ల వంట గ్యాస్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. మనదేశం ప్రతి ఏటా 5-6 మిలియన్ టన్నుల మేర కందిపప్పు, పెసరపప్పు వంటి పప్పు ధాన్యాలను మయన్మార్, కెనడా, ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకుంటోంది. నిజానికి మనదేశంలో పప్పు దినుసులు విపరీతంగా పండుతున్నా ఎందుకనో దిగుమతులు చేస్తున్నాం. వీటిని దేశీయంగా పండిస్తున్నా ధరలు రావడం లేదు. రైతులను ప్రోత్సహించడం లేదు. కందులు, సోయా అమ్ముకోలేక ఏటా రైతులు నానా యాతన పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ సందర్భంగా అయినా దేశీయ పంటలను ప్రోత్సహిస్తే మంచిది. పప్పులు, నూనె ధాన్యాలకు మన నేలలు అనుకూలం. ఇకపోతే ఇరాన్ ఆంక్షలతో హోర్ముజ్ జలసంధి స్థంభించిన కారణంగా వీటిని తీసుకొచ్చే నౌకలు కూడా మరో మార్గంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఫలితంగా రవాణా ఖర్చులు, బీమా ఖర్చులు భారీగా పెరిగి వాటి ప్రభావం రిటైల్ కొనుగోలుదారులపై పడుతుంది. అలాగే మనం వాడే జీడిపప్పు, పిస్తా, ఎండు ద్రాక్ష, ఆప్రికాట్ వంటి డ్రైఫ్రూట్స్, నట్స్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదముంది. వీటిని ఎక్కువగా ఇరాన్, అఫ్గానిస్థాన్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇరాన్ యుద్ధంలో తలమునకలై ఉంది. మరోవైపు అఫ్గనిస్థాన్ కూడా పాకిస్థాన్‌తో తలపడుతోంది. ఈ నేపథ్యంలో వీటి దిగుమతులు కూడా ప్రభావితమవుతాయి. హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు తొలగితే కొంత ఊపిరిపీల్చుకోగలుగుతారు. నిజానికి దేశంలో పంటలు పండుతున్నా దిగుమతులు విపరీతంగా చేసుకుం టున్నాం. దిగుమతులపై ఆంక్షలు విధిస్తే దేశీయంగా మన ఉప్పులు, పప్పులు కొనుగోలు చేసుకోవచ్చు. రైతులను ఈ దిశగా ప్రోత్సహించే చర్యలు కరువయ్యాయి. దిగుమతుల దాడుల కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలతో పాటు భారత్‌నూ పేదరికం పట్టి పీడిస్తోంది. 147కోట్ల దేశ జనాభాలో నేటికీ 28 శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారని ఇటీవలి అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్ పేద దేశం కాదని, భారతీ-యులే పేదవారనే అభిప్రాయం ఉంది. పాలకుల దృష్టి లోప కారణంగా మనదేశంలో పేదలు ఎదగడం లేదు. నిత్యావసరాలు వారికి అందడం లేదు. ఔషధాల ధరలు విపరీతంగా పెరిగాయి. విద్య, వైద్యం అందకుండా పోతోంది. వీటి గురించి పాలకులు ఆలోచన చేయడం లేదు. ఇప్పుడు యుద్ధం పుణ్యమా అని అన్న రకాల వస్తువుల ధరలు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. డబ్బున్న పాలకులు ఉండడం వల్ల వారికి పేదరికం అర్థం కావడం లేదు. పేదరికం సామాజిక రుగ్మతగా గుర్తించడం లేదు. ఆకలి, జీవన ఒత్తిళ్లు ఒక కుటుంబాన్ని ఎలా నిస్తేజంగా మార్చుతాయో, నిశ్శబ్దంగా వారి ప్రాణాలనే ఎలా మింగేస్తున్నాయో ఆయా సందర్భాల్లో జరుగుతున్న అనేకానేక ఆత్మహత్యలు ధృవీకరిస్తున్నాయి. బ్రిటిష్ పాలన నాటికంటే ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. దేశ సంపదలో సగానికి పైగా సంపద కేవలం 10శాతం మంది కుబేరుల దగ్గర పోగయ్యింది. మోడీ పాలనలో రూపాయి విలువ చరిత్రలో కనివిని ఎరుగనంత పతనావస్థకు దిగజారింది. పేదలు మరింత పేదలుగా కావడానికి, మధ్య తరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధానకారణం వ్యవసాయ క్షీణత, నిరుద్యోగం, విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడం అని నిపుణులు చెబుతున్నారు. ఈ దశలో మనం సంస్కరణలకు దిగాలి. ఆహారా ధాన్యాల దిగుమతులను తగ్గించుకోవాలి. దేశీయంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. దేశీయ వస్తువులను వాడాలనడం కాదు..దేశీయ ఆహారాలనే వాడలనే నినాదం రావాలి. ఈ యుద్ధంతో అయినా పాలకుల ఆలోచనా తీరు మారాలి. లేకుంటే సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయం. అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాల్లో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక సమస్యలు పేదరికానికి కారణమౌతున్నాయి. ఇవి ఒకదానితో ఒకటి ముడిపడి వుంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నా వాటి ఫలాలు, ఫలితాలు పేదలకు చేరడంలేదు. కారణం అవి సరిగా లేకపోవడం లేదా, అమలులో లోపాలు ఉండడమే కారణంగా చూడాలి. ప్రపంచ యుద్దాలతో మనం మారాలి. స్వయం సమృద్ధి దిశగా నడవాలి. సంక్షోభాలను ఎదుర్కొనేలా నిలబడగాలి. అప్పుడే దేశం ఆర్థికంగా నిలబడుతుంది.

# ఐదోరోజూ పరస్పర దాడులు

- ఇజ్రాయిల్ దాడులకు దీటుగా ఇరాన్ బాంబులు
- టెహ్రాన్ ప్రార్థనా మందిరంలో ఖమేనీ భౌతిక కాయం
- మూడ్రోజుల పాటు ప్రజల సందర్శనకు అనుమతి







**టెహ్రాన్, మార్చి 4:** ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదోరోజైన బుధవారంనాడు మరింత తీవ్రమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు జరుపుతోంది. ఇరాన్‌లోని ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా దాడులను విస్తరించింది. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాక్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్ క్షిపణులు సౌదీలోని ఎంబసీని, దుబాయ్‌లోని యూఎస్ కాన్సలేట్‌ను ఢీకొట్టాయి. ఖతార్‌లోని అల్ ఉదేద్ ఎయిర్‌బేస్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడి జరిగింది. కెర్మాన్ సిటీ శివార్లలో ఇజ్రాయెల్‌కు చెందిన హెర్మేస్ డ్రోన్‌ను కూల్చేసినట్టు కెర్మాన్ ప్రావిన్స్‌లోని ఐఆర్‌జీసీ ప్రాంతీయ విభాగం తెలిపింది. గత 24 గంటల్లో మూడు హెర్మేస్ డ్రోన్‌లను కూల్చేసినట్టు ప్రకటించింది. మధ్యప్రాచ్యంలోని ఇరాక్ 'ఎర్బిల్ బేస్', కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్‌బేస్, అరిఫ్‌జాన్ ఎయిర్ బేస్ సహా అమెరికా సైనిక స్థావరాలపై ఇంతవరకూ 230 డ్రోన్లు పేల్చినట్టు తెలిపింది. ఇజ్రాయెల్ గత శనివారంనాడు టెహ్రాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి ఇంతవరకూ ఇరాన్‌లో 800 మంది వరకూ ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా, ఐదు రోజుల్లో ఇరాన్‌లోని 1,700 లక్ష్యాలపై దాడులు చేసినట్టు యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. వీటిలో నావికాదళ నౌకలు, సబ్‌మెరీన్లు, యాంటీ షిప్ క్షిపణి వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు కూడా ఉన్నాయని వెల్లడించింది. కాగా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అల్ ఖమేనీకి ప్రజలు బుధవారం రాత్రి నుంచి మూడు రోజులు నివాళులు అర్పించనున్నాయి. పేటికలో ఉంచిన ఆయన మృతదేహాన్ని టెహ్రాన్‌లోని ప్రార్థనా మందిరంలో ఉంచనున్నారు.

# మోడీ పర్యటనలకు, దాడులకు లింకేంటి

## యుద్ధం అన్నది మా ప్రణాళికలో భాగం

## విమర్శలకు దీటుగా స్పందించిన ఇజ్రాయిల్



**న్యూఢిల్లీ, మార్చి 4:** ఇరాన్ - ఇజ్రాయెల్ దేశాల మధ్య గత ఐదు రోజుల నుంచి యుద్ధం నడుస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై బాంబు దాడులు చేశాయి. ఇరాన్ నాయకులే లక్ష్యంగా టెహ్రాన్‌లోని 30 చోట్ల బాంబు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన భార్య, కూతురు, అల్లుడు, మనవడు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జరిగిన దాడుల్లో ఖమేనీ చనిపోగా.. మరుసటి రోజు ఈ విషయాన్ని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రతి దాడులకు దిగింది. ఖమేనీ మృతి చెందినా ప్రధాని మోడీ స్పందించడం లేదని, ఖండించడం లేదని విపక్ష పార్టీలు నిలదీస్తున్నాయి. మోడీ తీరువల్ల భారత్ పరువు పోయిందని గగ్గోలు పెడుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడానికి రెండు రోజుల ముందు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు మోదీ పర్యటన సాగింది. మోదీ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజులకు.. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్.. ఇరాన్‌పై దాడి చేసింది. ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ, సోషల్ మీడియా ప్రచారాలపై స్పందించారు. రూవెన్ అజర్ మాట్లాడుతూ.. 'అదొక ఆపరేషనల్ అవకాశం మాత్రమే. ప్రధాని మోదీ వెళ్లిపోయిన తర్వాత ఆ అవకాశం వచ్చింది. మోదీ పర్యటన సందర్భంగా ఆయనతో దేశాభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడాము. ఈ విషయం గురించి ఆయనతో చర్చించలేదు. దాడులు చేస్తామని ఆ సమయానికి మాకు కూడా తెలీదు. మోదీ వెళ్లిపోయిన తర్వాత ఇరాన్‌పై దాడి చేయాలా? వద్దా? అన్నదానిపై నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజుల సమయం పట్టింది. ఇరాన్‌పై దాడులకు ఫిబ్రవరి 28వ తేదీ ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ తర్వాతే దాడులు జరిపాము. దాడులకు చాలా కాలం ముందునుంచే మేము అమెరికాతో సంప్రదింపులు జరుపుతూ ఉన్నాము. సరైన సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నామని చెప్పుకొచ్చారు. మోడీ పర్యటనలో యుద్ధం గురించి ఎందుకు మాట్లాడుతామని అన్నారు.

# తెరపైకి వారసుడు

## ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ముజ్తబా ఖమేనీ?

## ఐఆర్‌జీసీ మద్దతుతో పగ్గాలు చేపట్టిన ఖమేనీ రెండో పుత్రుడు



**టెహ్రాన్, మార్చి 4:** పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలల మధ్య ఇరాన్ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించారన్న వార్తల నేపథ్యంలో, ఆయన కుమారుడు ముజ్తబా హొస్సేనీ ఖమేనీ ఇరాన్ తదుపరి సర్వోన్నత నేతగా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. అధికారిక ప్రకటన వెలువడక ముందే, అధికార మార్పిడి ప్రక్రియ పూర్తయిందని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తోంది. 1969లో మషాద్‌లో జన్మించిన ముజ్తబా, చిన్నతనం నుంచే ఇస్లామిక్ విప్లవ ఛాయల్లో పెరిగారు. కోమ్‌లోని మత విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన ఆయన, మతపరమైన ర్యాంకుల్లో 'ఆయతుల్లా' స్థాయిని అందుకోలేకపోయినా, తన తండ్రి కార్యాలయంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా ఎదిగారు. 1980లలో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధంలో పాల్గొన్న అనుభవం ఆయనకు ఇరాన్ సైన్యంతో, ముఖ్యంగా ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ)తో బలమైన సంబంధాలను ఏర్పరిచింది. ఈ సైనిక మద్దతే ఇప్పుడు ఆయనను సుప్రీం లీడర్ పీఠంపై కూర్చోబెడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే అధికారం 88 మంది మత పెద్దలతో కూడిన 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' కు ఉంటుంది. వారసత్వ రాజకీయాలు తమ సిద్ధాంతాలకు విరుద్ధమని ఈ కమిటీలోని కొందరు వాదిస్తున్నప్పటికీ, ఐఆర్‌జీసీ ఒత్తిడి మేరకు ముజ్తబా పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక పదవులు చేపట్టని ముజ్తబా, తెర వెనుక నుండి పాలనాపరమైన నిర్ణయాలను శాసించడంలో సిద్ధహస్తుడని పేరుంది. 2019లోనే అమెరికా ముజ్తబాపై ఆంక్షలు విధించింది. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఉన్నాయని, స్విస్ బ్యాంక్ ఖాతాలతో పాటు బ్రిటన్‌లో సుమారు 138 మిలియన్ డాలర్ల విలువైన లగ్జరీ ఆస్తులు ఉన్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. రహస్యంగా సాగే ఆయన వ్యక్తిగత జీవితంపై ప్రపంచానికి పెద్దగా అవగాహన లేదు.

### విషాదంలో కుటుంబం

ఇటీవలి దాడుల్లో కేవలం అలీ ఖమేనీ మాత్రమే కాకుండా, ముజ్తబా భార్య జహ్రా, ఆయన సోదరి, అల్లుడు మరియు మనవడు కూడా మరణించినట్లు అనధికారిక సమాచారం అందుతోంది. కుటుంబ సభ్యులను కోల్పోయిన విషాదంలో ఉన్న ముజ్తబా, ఇప్పుడు యుద్ధం కారణంగా అస్థిరంగా మారిన ఇరాన్‌ను ఏ విధంగా ముందుకు నడిపిస్తారనేది ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.



# భారత్ చేరుకున్న ఫిన్‌లాండ్ అధ్యక్షుడు

## విమానాశ్రయంలో స్టబ్‌కు ఘనంగా స్వాగతం

**న్యూఢిల్లీ, మార్చి 4:** ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ భారత్ విచ్చేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఆయన ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆధ్వర్యంలోని బృందం ఘన స్వాగతం పలికింది. గార్డ్ ఆఫ్ ఆనర్ లభించింది. స్టబ్‌తోపాటు ఫిన్‌లాండ్‌కు చెందిన పలువురు కీలక నేతలు, అధికారులు కూడా ఇండియా చేరుకున్నారు. స్టబ్ తన పర్యటన సందర్భంగా ఇండియాతో కీలక ఒప్పందాలు చేసుకుంటారు. ఈ మేరకు అనేక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపారం, వాణిజ్యం, సాంకేతిక రంగంలో సహకారం వంటి అంశాల్లో ఒప్పందాలు జరుగుతాయి. స్టబ్స్.. ఈ చర్చల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. అలాగే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కూడా సమావేశమవుతారు. స్టబ్స్ ఇండియాలో పర్యటిస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. స్టబ్స్‌కు స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. స్టబ్స్ పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ఉపయోగపడుతుందని, గురువారం ఆయనను కలుసుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. భారత పర్యటనపై స్టబ్ కూడా ప్రత్యేకంగా స్పందించారు. భారత పర్యటనపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ మోదీ, రాష్ట్రపతి ముర్మును కలుసుకోబోతున్నట్లు వెల్లడించారు. గురువారం సాయంత్రం మీడియాతో మోదీ, స్టబ్ మాట్లాడుతారు. ఫిన్‌లాండ్ ప్రధాని పె÷-టటెరి ఒర్పో ఇటీవలే ఇండియాలో పర్యటించారు. న్యూఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇక.. ఇండియా, ఫిన్‌లాండ్ మధ్య చాలాకాలంగా స్నేహపూర్వక సంబంధాలున్నాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు.



# కమనీయం రమణీయం శ్రీ వెంకటేశ్వర కళ్యాణం

**శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి**



**నేటిసాక్షి,ములుగు ప్రతినిధి :** కమనీయం రమణీయం శ్రీ వెంకటేశ్వర కళ్యాణం అని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు బుధవారం ఆయన నూగూరు వెంకటాపురం మండల కేంద్రంలోని స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణానికి సాంబశివరెడ్డి స్నేహలత దంపతులు హాజరయ్యారు ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకుని కళ్యాణానికి హాజరు కావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు స్వామి వారిపై ఉన్న భక్తితో వెంకటేశ్వరుని కళ్యాణం సందర్భంగా పట్టు వస్త్రాలు బుధవారం సమర్పించినట్లు తెలిపారు సమాజ శ్రేయస్సు, సకల జనులకు మంచిని ప్రసాదించాలని దేవుడిని కోరినట్లు సాంబశివరెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు పురోహితులు సాంబశివరెడ్డి వ్యక్తిగత సిబ్బంది పాల్గొన్నారు కాగా ఈ సంవత్సరం స్వామివారి కళ్యాణానికి వేలాది సంఖ్యలో భక్తులు హాజరై భక్తి శ్రద్ధలతో స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించారు.

# ఉచిత విద్యుత్తు గొప్పలు క్షేత్రస్థాయిలో తిప్పలు

**గృహజ్యోతి పథకం కొంతమందికి పరిమితం.కొండాపురం యువ నాయకుడు గాజుల కృష్ణ రెడ్డి**



**నేటి సాక్షి : జోగులాంబ గద్వాల (కేటి దొడ్డి):** మండలంలోని వెంకటాపురం సబ్ స్టేషన్ లో తనిఖీ నిర్వహించిన కొండాపురం కృష్ణరెడ్డి, యుగంధర్ గోనెల జైపాల్ ప్రభుత్వం 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తున్నామని చెబుతున్న క్షేత్రస్థాయిలో రైతులకు కేవలం 12నుండి 16 గంటలు మాత్రమే విద్యుత్ అందితోందని సబ్ స్టేషన్ రికార్డులే ఇందుకు నిదర్శనం అని ఆరోపించారు వేసవి ఆరంభంలోనె అప్రకటిత కోతలు మరియు లో వోల్టేజ్ సమస్యలు ఉన్నాయని అన్నారు నాలుగు ఫీదర్లకు 8 ఎంవిఏ5ఎంవిఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ మాత్రమే ఉన్నాయి కెపాసిటీ బ్యాంక్ లేని కారణంగా నాణ్యమైన కరెంటు అందడం లేదు తెలిపారు గృహజ్యోతి పథకం 200 యూనిట్లు ఉచిత విద్యుత్ హామీని ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అర్హులైన వారికి కూడా బిల్లులు వస్తున్నాయని విమర్శించారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర రాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణలో 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అరచేతిలో వైకుంఠం చూపించి గద్దినేకే ప్రయత్నం చేస్తుందన్నారు నిరంతరం విద్యుత్ బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ మాత్రమే రైతులకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్ కె దక్కుతుందని తెలిపారు

# ఇందిరమ్మ ఇండ్లకు సరిపడే ఇసుక పోయాలి



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ నాయకులు మాట్లాడుతు గన్నేరువరం మండలం లో మంజూరు అయిన ఇందిరమ్మ లబ్ధిదారులకు సరిపోయేంత ఇసుక పోయాలని సిపిఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కొన్ని గ్రామాల్లో సరిపడేంత ఇసుక లేక నిర్మాణం చాలా ఆలస్యం అవుతుందని అన్నారు అధికారులు వెంటనే పర్యవేక్షణ చేసి వారికి ఇసుక వచ్చే విధంగా చూడాలని సిపిఐ నాయకులు అన్నారు. లబ్ధిదారులకు ఇల్లు నిర్మాణం పూర్తయ్యసరికి 20 నుండి 30 ట్రిప్పులు ఇసుక వరకు పడుతుంది కానీ టోకెన్ పెట్టి న ఇసుక రాకుండా పోతుందన్నారు ఇసుక కావాలనుకుంటే ప్రైవేట్ గా పోసుకోవాలని అను కుంటే అడ్డగోలు రేటు తీసుకుంటున్నారని అన్నారు. కొన్ని గ్రామాల్లో బెస్మెంట్ వరకు మాత్రమే ఉన్నాయి ఎన్నో ఏండ్ల నుండి నివాసం ఉంటున్నా కానీ పరంపోగు అని చెప్పి ఇండ్లు ఆపుతున్నారు రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులను వెంటనే గుర్తించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ కాంతలా అంజిరెడ్డి సిపి ఐ మండల కార్యదర్శి చో క్కల శ్రీశైలం మండల సహాయ కార్యదర్శి లు పి ప్పాల కనకయ్య కూన మల్లయ్య గ్రామ కార్యదర్శులు బోయిన మల్లయ్య బొమ్మకంటి అంజయ్య చారి, మండల నాయకులు ఎండి నాయ్యిమ్ రాపోలు రాయమల్లు చొక్కాల శ్రీనివాస్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# అక్రమ కట్టడాలకు అధికారులే కంచుకోట

**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో మున్సిపల్ ఖజానాకు గండి మామూళ్ల మత్తులో మౌనం వహిస్తున్నారా అధికారులు? సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు అడ్డుకట్ట లేకుండా పెరిగిపోతుండగా, వాటిని నియంత్రించాల్సిన మున్సిపల్ మరియు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మాత్రం అనుమానాస్పదంగా నిశ్శబ్దంగా ఉండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా అనుమతుల కంటే ఎక్కువ అంతస్తులు, సెట్‌బ్యాక్ ఉల్లంఘనలు, పార్కింగ్ లేకుండా నిర్మాణాలు, వాణిజ్య వినియోగాలకు అనుమతి లేకుండానే మార్పులు-ఇవి అన్నీ బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ అధికారుల నుంచి చర్యలు మాత్రం కనిపించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అనుమతులు ఒక విధంగా తీసుకుని, నిర్మాణాలు మరో విధంగా చేపడుతున్న కాంట్రాక్టర్లు, బిల్డర్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చేతులు ఎత్తేయడం వెనుక భారీ స్థాయిలో అవినీతి జరుగుతోందన్న అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయి. అక్రమ నిర్మాణాలను కూల్చాల్సిన వారు కాపాడుతున్నారన్న భావన పట్టణంలో విస్తరిస్తోంది. దీంతో మున్సిపాలిటీకి రావలసిన అభివృద్ధి ఛార్జీలు, పెనాల్టీలు, పన్నుల రూపంలో వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గిపోతుండగా, ఆ నష్టం ప్రజా ఖజానాకు కాకుండా కొందరి వ్యక్తిగత లాభాలకు దారి తీస్తోందని పట్టణ ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

ఇదే సమయంలో సాధారణ ప్రజలు చిన్న గది నిర్మించాలన్నా, ఇంటి మరమ్మతులు చేయాలన్నా నిబంధనల పేరిట నోటీసులు, జరిమానాలు, పనుల నిలుపుదల వంటి చర్యలు ఎదుర్కొంటున్నారని వారు వాపోతున్నారు. పెద్ద స్థాయి అక్రమ నిర్మాణాలపై మాత్రం మౌనం పాటించడం అధికారుల ద్వంద్వ వైఖరిని బహిర్గతం చేస్తోందని విమర్శిస్తున్నారు. "నిబంధనలు పేదలకేనా? పెద్దల అక్రమాలకు ఎందుకు మినహాయింపు?" అనే ప్రశ్న పట్టణంలో వినిపిస్తోంది. అక్రమ నిర్మాణాల కారణంగా పట్టణ ప్రణాళిక అస్తవ్యస్తం అవుతోందని, భవిష్యత్తులో ట్రాఫిక్, డ్రైనేజీ, భద్రత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ ఆదాయాన్ని కాపాడాలని పట్టణ



ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గండోర్రే గుట్ట నుండి ఆలయానికి నాగులమ్మ రాక

- **ఎర్రెట్టల గుట్ట నుండి సడాలమ్మ ను తెచ్చిన పూజారులు**
- **గోదావరి పుణ్య స్నానాలు ఆచరించిన పూజారులు వడ్డెలు**



**నేటిసాక్షి,ములుగు ప్రతినిధి :** మంగపేట మండలం వాగొడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల లక్ష్మీ నర్సాపూర్ గ్రామంలో నాగులమ్మ జాతర రెండో రోజు బుధవారం నాగులమ్మ సడాలమ్మ రాక తో జాతర ముఖ్య ఘట్టం ప్రారంభమైంది ఉదయం 11గంటలకు నాగులమ్మ ఆలయ ప్రధాన పూజారి బాడిశ నాగరమేష్ ఆధ్వర్యంలో ఆదివాసీ పూజారులు వడ్డెలు సమీపంలో ఉన్న గండోర్రె గుట్ట ప్రాంతంలో సుమారు రెండు గంటలకు పైగా నాగులమ్మ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే సమయంలో ఎర్రెట్టల గుట్ట వద్దకు వెళ్ళిన పూజారులు సడాలమ్మ కు పూజలు చేసి నాగులమ్మ ను సడాలమ్మ ను అర్థి బిడ్డల డోలు వాయిద్యాల నడుమ తీసుకు వొచ్చి లక్ష్మి నర్సాపూర్ గ్రామంలో నాగులమ్మ కు చెందిన డాలు జెండాలతో ఎదుర్కోలు నిర్వ హించారు. అనంతరం రమణక్కపేట సమీపంలో గల గోదావరి నది వద్దకు చేరుకొని పూజారులు ఏడు చెలిమలు తీసి వివిధ రకాల దళాలతో అభిషేఖాలు పుణ్యస్నానాలు నిర్వహించారు. అనంతరం నాగులమ్మ ఆలయానికి తీసుకు వొచ్చి గద్దెలపై ప్రతిష్టించారు రాత్రి 8 గంటలకు చుంచుపల్లి గ్రామం నుండి అమ్మవారికి చెందిన అవిరేణి కుండలను ఆదివాసీ మహిళలు ఆలయానికి సమర్పించారు ఆలయ ధర్మకర్త మేనేజింగ్ ట్రస్టీ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి పూజ కార్యక్రమాలను పర్యవేక్షించగా పూజారులు సోడి సత్యం కుర్సం పుల్లయ్య కట్టం సమ్మక్క చౌళం భవాని,మడకం సుప్రజ,పోలిశెట్టి స్వరూప,వడ్డెలు కోర్స శ్రీకాంత్ మూయబోయిన శివ తుర్స చిన్నబ్బాయి కారం రాజేష్ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కులపెద్దలు కుర్సం విష్ణుమూర్తి మడకం రాజేశ్వర్ రావు చౌళం వెంకటేశ్వర్లు కొమరం మాధవ రావు,కొమరం పాపారావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి స్వర్ణకుమారి.

**నేటి సాక్షి వికారాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నాలుగు దశలలో 99 రోజుల ఆరోగ్య కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి స్వర్ణకుమారి పత్రికా ప్రకటనలో తెలిపారు. మార్చి 6వ తేదీ నుండి 99 రోజులపాటు మాతృ శిశు ఆరోగ్య సేవల కొరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి గైనకాలజిస్టుల ద్వారా ఎనీమియా స్క్రీనింగ్, అధిక ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీల గుర్తింపు, సర్వేకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, చిన్నపిల్లలకు పూర్తి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు, విటమిన్ ఏ ద్రావణం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. యువతలో పరీక్షల ఒత్తిడి నిర్వహణకు కౌన్సిలింగ్ నిర్వహించడం, మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు అందించడం, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం జెరియాట్రిక్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు ఆర్ బి ఎస్ కే టీముల ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు మరియు ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసి విస్తృతంగా గ్రామాలలో పట్టణాలలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అందరు స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వాసుపత్రులను ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.



# అర్ధరాత్రి కూల్చివేతకు ప్రతిగా అదే చోట అంబేద్కర్ గద్దె పునర్నిర్మాణం

- **పోలీసు బలగాల మధ్య ఉద్రిక్తత - డిబిఎఫ్ నేత అరెస్టు యత్నం విఫలం**



**నేటి సాక్షి గజ్వేల్.....** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గ్రామంలో B R Ambedkar విగ్రహ ఆవిష్కరణ కోసం నిర్మించిన గద్దెను ఆర్ & బి అధికారులు అర్ధరాత్రి కూల్చివేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి ఈ చర్య జరిగినట్లు గ్రామస్తులు ఆరోపించారు. సమాచారం అందుకున్న దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ నాయకత్వంలో బుధవారం ఉదయం గ్రామస్తులు కూల్చివేసిన అదే ప్రదేశంలో గద్దె పునర్నిర్మాణం ప్రారంభించారు. భారీ పోలీసు బలగాలు మోహరించినప్పటికీ, గ్రామస్తులు వెనక్కి తగ్గకుండా యుద్ధ ప్రాతిపదికన గద్దె నిర్మాణాన్ని పూర్తి చేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిర్మాణాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, డిబిఎఫ్ నేత శంకర్‌తో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో శంకర్‌ను అరెస్ట్ చేయడానికి పోలీసులు యత్నించగా మహిళలు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తమైంది. మహిళల నిరసనతో పోలీసులు అరెస్ట్ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు ప్రత్యేక అనుమతులు అవసరం లేదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో విగ్రహ స్థాపనను అడ్డుకోవడం సరికాదన్నారు. అర్ధరాత్రి దొంగల్లా గద్దె కూల్చివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆక్షేపించారు. గద్దె కూల్చివేతకు బాధ్యులైన ఆర్,బి అధికారులను, గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. సమాచారం అందుకున్న అదనపు పోలీస్ కమిషనర్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విగ్రహం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి తీసుకోవాలని సూచించగా, నాయకులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. చర్చల అనంతరం ఉద్రిక్త పరిస్థితులు కొంత సద్దుమణిగినట్లు సమాచారం. గ్రామంలో ఒకవైపు భారీ పోలీసు బలగాలు మోహరించగా, మరోవైపు గ్రామస్తులు గద్దె నిర్మాణంలో భాగస్వాములై ఐక్యతను ప్రదర్శించారు. ఘటనపై స్థానికంగా చర్చ నడుస్తోంది. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి,జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, దళిత సంఘాల నాయకులు కృష్ణ, పుట్ట రాజు ,బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్, గ్రామ అంబేద్కర్ సంఘం నాయకులు మహిళ నాయకురాలు రాణి తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI


# బాలికల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది

## ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజి నాయక్




**నేటి సాక్షి ,పాములపాడు:** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి–ఆర్. రామంజి నాయక్, ఆత్మకూరు రూరల్ సి.ఐ– ఎం.సురేష్ కుమార్ రెడ్డి, మరియు పాములపాడు ఎస్సై– పి .తిరుపాలు ఆధ్వర్యంలో పాములపాడు మండల కేంద్రమైన కె జి బి వి స్కూల్ లో బాల బాలికలకు మహిళలపై జరిగే నేరాల నియంత్రణ పై కార్యక్రమం నిర్వహించడమైనది. పాములపాడు మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ యం. రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలపై నేరాలపై నియంత్రణపై అవగాహన కార్యక్రమం నికి ముఖ్య అతిథిగా ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజి నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆత్మకూరు డిఎస్పి– ఆర్.రామాంజి నాయక్ మాట్లాడుతూ . మహిళలపై జరిగే నేరాల నియంత్రణ పై గురించి , బాల్య వివాహాలు గురించి అవగాహన కల్పిస్తూ కొన్ని ముఖ్య విషయాలు విద్యార్థినులకు, బాలికలకు చెప్పడమైనది.. సమాజంలో ఏమైనా తప్పు జరుగుతుంది. అని తెలిసినపుడు మీరు 100 డయల్ కాల్ కి ఫోన్ చేసి ఆ విషయం చెపితే మా పోలీసు సిబ్బంది అక్కడికి వచ్చి సమస్య ను పరిష్కరిస్తారు విద్యార్థులు కష్టపడి చదివి తమ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకునే దిశగా ముందుకు వెళ్లాలని చెప్పారు. అంతేకాకుండా..ఇటీవల కాలంలో పిల్లలకు సెల్ ఫోన్ వినియోగం ఎక్కువైందని తల్లితండ్రులు పిల్లలకు జాగ్రత్తగా ఉండాలని, సెల్ ఫోన్ పిల్లలకు ఇవ్వకుండా చూసుకోవాలి అన్నారు. ఇప్పుడు ఉన్న ఈరోజుల్లో మీ బంగారు భవిష్యత్తు మీ చేతుల్లో ఉన్నది. మీరు మీ జీవితాలను మీరు మంచి మార్గంలో నడిస్తే మీకు విజయాలు మీ ముందు ఉంటావ్ . ముఖ్యంగా మీరు ఈ వయసు చదువుకున్న వయస్సు కాబట్టి చదువుకే ప్రాధాన్యత ఇవ్వాలి .ఇంకేమి మీరు వేరే ఆలోచనలు పెట్టుకోకూడదు. ఎక్కడెక్కడో నుంచి ఇక్కడ చదువుకొంటున్నారు కాబట్టి ఇప్పుడు ఉన్న రోజుల్లో ప్రేమ, పేరుతో అమాయకత్వం అమ్మాయిలను వలలో వేసుకొని మధ్యలోనే చదువు ఆపేసి ప్రేమ పేరుతో ఉన్న ఊరుని 20 సంవత్సరాలు పెంచి పోషించిన కన్న తల్లిదండ్రుల ను వదిలేసి వెళ్తే ఆపైన పడే బాధ తల్లి తండ్రులు చాలా రోదించడం తల్లడిల్లిపోవడం ఒక నరకం లాగా ఉంటుంది. తరువాత మీకు మీరు తల్లి తండ్రులు కాదని పెళ్ళి వయసు రాకముందే పెళ్లి చేసుకుంటే మీకు గర్భం వచ్చాక కూడా చాలా పురిటి నొప్పులతో సంతోషంగా కాన్పు కావడం కష్టం.. అవుతుంది. సరైన సమయంలో పెళ్లి వయసు వచ్చాక పిల్లలకు పెద్దలు తప్పకుండా పెళ్లిలు చేస్తారు. ఎలాంటి సమస్యలు తలెత్తవ్. కాబట్టి ఇప్పుడు ఉన్న రోజులో ఆడపిల్లలకు మంచి జీవితం ఉంది. 15 సంవత్సరాలు కిందట ఎవరికి అన్నం దొరికేది కాదు కానీ ఇప్పుడు ఉన్న రోజులో దేవుడు దయ వల్ల ప్రతి ఒక్కరి ఇంటిలో పుష్కలంగా అన్నం ఉంటుంది. కానీ ప్రతి ఒక్కరికి ఒక యుగో, ఒక స్వతంత్ర గా బ్రతకాలి నాకెవ్వరు చెప్పకూడదు నాకు నేను సాటి అని ఫ్రీడమ్ ఫ్రీడమ్ అని పెద్దల మాటలు వినకుండా భవిష్యత్తు సర్వనాశనం చేసుకుంటున్నారు. నేను చెప్పేది ఒకటే ఒకటి బాల బాలికలకు ముఖ్యంగా మీరు మీ తల్లితండ్రులు ను గౌరవించండి తరువాత మీ ఉపాధ్యాయులను గౌరవించండి కానీ మీ బంగారు భవిష్యత్తు మీ చేతుల్లో ఉన్నది. ఏది కూడా అహంకారం తో నిర్ణయాలు తీసుకోకూడదు అందుకే ప్రతి ఒక్కరికి జవాబు దారితనం ఉండాలి. బాధ్యత ఉండాలి. మనం సొసైటీ లో బ్రతుకుతున్నాము మనం ఒక్కరే లేము వ్యవస్థ లో చాలా మంది ఉన్నారు నలుగురితో పాటు మనం బాధ్యత గల పౌరునిగా,బాధ్యత గల పౌరురాలుగా, మనం బ్రతకాలి అప్పుడే మనకు మంచి పేరు వస్తుంది. మీరు ఉన్నత చదువులు చదివి మీరు ఉన్నత స్థానం లోకి ఎదుగుతారని మీ ఉపాధ్యాయులకు, మీ ఊరికి మన జిల్లాకి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరుకుంటున్నాను అని విద్యార్థినులకు మంచి మంచి ముఖ్యమైన విషయాలు చెప్పడం జరిగింది. కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన పోలీస్ అధికారులకు మా తరుపున కృతజ్ఞతలు, చెప్పడం మరియు మా స్కూల్ లో ఈ మహిళలపై నేరాలపై అవగాహన కార్యక్రమం గురించి మన డీఎస్పీ సార్ వారు మా కోసం ప్రత్యేకంగా మా పిల్లల భవిష్యత్తు కోసం చాలా చాలా మంచి విషయాలు క్లుప్తంగా వివరించారు. అందుకు చాలా చాలా ధన్యవాదములు తెలుపుతూ ఈ కార్యక్రమం కస్తూర్బా గాంధీ పాఠశాల టీచర్స్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయినది.

# గజ్వేల్ బస్టాండ్ నిర్మాణంపై నీలినీడలు

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా? అధికారుల మౌనమా?




- నాణ్యతపై అనుమానాలు.. పనుల జాప్యంపై వెల్లువెత్తుతున్న నిరసనలు

**నేటి సాక్షి,గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలో నూతన బస్టాండ్ నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధునిక వసతులతో ప్రయాణికులకు అందుబాటులోకి రావాల్సిన ఈ భవన నిర్మాణం పనులు నత్తనడకన సాగుతుండటంపై స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ అలసత్వం వెరసి గజ్వేల్ బస్టాండ్ ప్రశ్నార్థకంగా మారింది. పాత బస్టాండ్‌ను కూల్చివేసిన అనంతరం అదే స్థలంలో సకల సౌకర్యాలతో కొత్త భవనాన్ని నిర్మించేందుకు నిధులు కేటాయించారు. అప్పటి ముఖ్యమంత్రి ఆదేశాలతో పనులు ప్రారంభమైనప్పటికీ, నేటికీ అవి పూర్తి కాలేదు. ఫలితంగా సికింద్రాబాద్, సంగారెడ్డి, భువనగిరి, దుబ్బాక వంటి ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రయాణికులు నిలువ నీడ లేక రహదారుల పక్కనే బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. బస్టాండ్ అందుబాటులో లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండి, వానకు తడిసి ముద్దవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కనీసం కూర్చునేందుకు సీట్లు, తాగునీరు, మరుగుదొడ్లు, సరైన విద్యుత్ దీపాలు (లైటింగ్) వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. నిర్మాణ పనుల పురోగతి మందగించడమే కాకుండా, జరుగుతున్న పనుల నాణ్యతపై కూడా ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, పనులను పర్యవేక్షించి, నిర్దిష్ట గడువులోగా బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గజ్వేల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కార్పొరేటర్ ఉమారాణి-వెంకటరమణ దంపతులకు సన్మానం

## 54వ డివిజన్ అశోక్ నగర్‌లో తీగుట్ల రమేష్ కుమార్ ఆధ్వర్యంలో వేడుక



**నేటి సాక్షి,కరీంనగర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 54వ డివిజన్ అశోక్ నగర్‌లో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి–వెంకటరమణ దంపతులకు ఘన సన్మానం జరిగింది. తీగుట్ల రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డివిజన్ అభివృద్ధికి నూతన జవజీవాలు అందిస్తారనే నమ్మకంతో గెలిపించిన కార్పొరేటర్ దంపతులకు స్థానిక నేతలు, కాలనీ వాసులు గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఉమారాణి–వెంకటరమణ మాట్లాడుతూ.. డివిజన్ సమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా అశోక్ నగర్ మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో దుబాసి భూమయ్య, గాదం నారాయణ, తీగుట్ల శ్రీనివాస్, రోడ్డ శ్రీరాములు, గాదం జగన్, జవ్వాజి మల్లేశం, గాదం శ్రీనివాస్, శ్రీధర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు డివిజన్ పెద్దలు, మహిళలు మరియు కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన కార్పొరేటర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పెద్ద మసాన్ పల్లి గ్రామ సర్పంచ్



**నేటి సాక్షి తొగుట.. (వడ్డే నరసింహులు):** పెద్ద మసాన్ పల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకిచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకొచ్చి మరోసారి మాట నిలుపుకున్న పెద్ద మసాన్ పల్లి సర్పంచ్ పెద్ద మసాన్ పల్లి గ్రామంలో దాసరి దశరథం లక్ష్మి వారి కుమార్తెకు గ్రామ సర్పంచ్ పన్యాల ప్రవీణ్ రెడ్డి పేదింటి ఆడబిడ్డకి 5000 రూపాయలు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పెద్ద మసాన్ పల్లి ఉపసర్పంచ్ బోయిన శ్రీనివాస్ పన్యాల మధుసూదన్ రెడ్డి వార్డ్ సభ్యులు తాళ్ల స్వామి అంబిగల్ల కిషన్ బోయని రాములు హారికంత్ ప్రశాంత్ ప్రవీణ్ భాను తదితరులు పాల్గొనడం జరిగింది

# మరికల్‌లో మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ

### ఈజీఎస్ పథకం కింద రూ, 10 లక్షలు మంజూరు....



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల మండల కేంద్రంలో ఈజీఎస్ పథకం కింద మహిళ సమైక్య భవనా నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డి మరికల్ గ్రామ సర్పంచ్ గోప చెన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్య మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోని గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్నదని చేపడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మరికల్ మండల ఎంపీడీవో భృతి విరాజ్, మరికల్ మండల ఏపీఎం చెన్నప్ప, మరికల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెలగొంది వీరన్న, మరికల్ మండలం పంచాయతీరాజ్ ఏఈ ప్రవీణ్ కుమార్, మహిళా సమాఖ్య సిసి హనుమంతు, మరికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరీష్ కుమార్, వార్డు సభ్యులు పెంట మీద రాఘవేంద్ర, ఎనిమిదో వార్డు సభ్యులు ఎల్ శివకుమార్, సురిటి చంద్రశేఖర్, వివిధ వార్డ్ సభ్యులు తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, రఘు టైజన్, ఇంకా చింతలయ్య, మాజీ ఎంపిటిసి సీమ గోపాల్, మహిళా సమైక్య సభ్యులు మహిళలు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీని సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్



**నేటి సాక్షి,చేర్యాల:** చేర్యాల 6వ వార్డు (బండపల్లి) పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ మరియు సహాయక కమిటీ (ూూామీాజ) సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ ముస్త్యాల అరుణ అధ్యక్షత వహించారు.కేంద్రానికి వచ్చిన చిన్నారుల ఎత్తు మరియు బరువులను కొలిచి వారి ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించారు. పోషకాహార పంపిణీ గర్భిణీలు, బాలింతలు మరియు పిల్లలకు బాలామృతం, కోడిగుడ్లు మరియు ఇతర పోషకాహార (THR) పదార్థాలను పంపిణీ చేశారు. హోలీ పండుగను పురస్కరించుకుని కేంద్రంలో చిన్నారులతోకలిసి హోలీ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముస్త్యాల అరుణ స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్, అంగన్‌వాడీ టీచర్ వీ. రమ్య, ఆయా అంజమ్మ, ఆశా కార్యకర్త ఖ. పద్మ, తల్లులు, గర్భిణీలు మరియు బాలింతలు పాల్గొన్నారు.

# రంగుల హోలీ హోలీ పండుగ...

### గ్రామ గ్రామాన హోలీ రంగోలి....




**నేటి సాక్షి,(ఇమామ్ సాబ్ ):** హోలీ పండుగను పురస్కరించుకొని నారాయణపేట జిల్లాలోని మరికల్ ధన్వాడ వివిధ గ్రామాలలో బుధవారం నాడు గ్రామాల ప్రజలు, యువకులు, మహిళలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు రంగులు చల్లుకుంటూ ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



## వాంఖడేను సైలెంట్ చేస్తాం

### టీమిండియాకు సామ్ కరన్ హెచ్చరిక

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా నేడు జరగబోయే భారత్ ఇంగ్లాండ్ సెమీఫైనల్ పోరుకు ముందే వాతావరణం వేడెక్కింది. మైదానంలోకి అడుగుపెట్టక ముందే ఇంగ్లాండ్ ఆటగాళ్లు మైండ్ గేమ్స్ మొదలుపెట్టారు. ముఖ్యంగా ఇంగ్లాండ్ స్టార్ ఆల్ రౌండర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు భారత అభిమానుల్లో సెగ పుట్టిస్తున్నాయి. వాంఖడే స్టేడియం అంటేనే క్రికెట్?కు పెట్టింది పేరు, అక్కడ ప్రేక్షకుల అరుపులతో స్టేడియం దద్దరిల్లిపోతుంది. అటువంటి స్టేడియాన్ని నిశ్శబ్దంగా మారుస్తామని సవాల్ విసరడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముంబయిలో జరగబోయే ఈ కీలక పోరులో గెలిచి ఫైనల్?కు దూసుకెళ్లాలనే కసితో ఉన్న టీమిండియాను ఆ మాటలు ఎంతవరకు ప్రభావితం చేస్తాయో చూడాలి. సెమీ ఫైనల్?కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్?లో సామ్ కరన్ మాట్లాడుతూ గురువారం వాంఖడే స్టేడియం చాలా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉంటుందని తాను భావిస్తున్నట్లు నవ్వుతూ చెప్పారు. "ఒకవేళ స్టేడియంలోని ప్రేక్షకులు నిశ్శబ్దంగా ఉన్నారంటే, మైదానంలో ఇంగ్లాండ్ జట్టు చాలా బాగా రానిస్తుందని అర్థం" అని వివరించారు. ముంబయి క్రౌడ్ ఇచ్చే మద్దతు తమకు తెలుసని, కానీ వారిని సైలెంట్?గా చేయడం ద్వారా భారత్?పై ఒత్తిడి పెంచవచ్చని కరన్ అభిప్రాయపడ్డారు. అభిమానుల అరుపులను నియంత్రించగలిగితే తాము మ్యాచ్?లో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నట్లేనని ధీమా వ్యక్తం చేశారు.

సామ్ కరన్ చేసిన ఈ వ్యాఖ్యలు 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ ముందు ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలను గుర్తుకు తెస్తున్నాయి. అప్పట్లో అహ్మదాబాద్?లోని లక్షా ముప్పై రెండు వేల మంది ప్రేక్షకులను నిశ్శబ్దంగా మార్చడం కంటే సంతృప్తినిచ్చే విషయం మరొకటి ఉండదని కమిన్స్ చెప్పారు. అన్నట్లుగానే ఆ మ్యాచ్?లో ఆస్ట్రేలియా భారత్?ను ఓడించి లక్షలాది మంది భారతీయుల హృదయాలను బద్దలు కొట్టింది. ఇప్పుడు సరిగ్గా అదే బాటలో సామ్ కరన్ కూడా స్టేడియంను సైలెంట్ చేస్తామంటూ వ్యాఖ్యానించడం భారత అభిమానులకు ఆ చేదు జ్ఞాపకాలను గుర్తు చేస్తోంది. భారత్?లో ఆడేటప్పుడు ఉండే హై వోల్టేజ్ శబ్దాన్ని తాము బ్లాక్ చేయగలమని సామ్ కరన్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్ ఆటగాళ్లు ఐపీఎల్ వంటి టోర్నీల వల్ల ఇక్కడి వాతావరణానికి, ప్రేక్షకులకు బాగా అలవాటు పడ్డారని చెప్పారు. "చాలా మంది యువ క్రికెటర్లు భారత్?తో సెమీస్ ఆడాలని కలలు కంటారు, మాకు ఆ అవకాశం రావడం గొప్ప విషయం" అని కరన్ అన్నారు. స్టేడియం లోపల ఎంత సౌండ్ ఉన్నా దానిని ఒక అద్భుతమైన అనుభవంగా తీసుకుంటామని, కానీ అంతిమంగా మా లక్ష్యం మాత్రం స్టేడియాన్ని నిశ్శబ్దంగా మార్చి ఫైనల్?కు వెళ్లడమేనని కరన్ స్పష్టం చేశారు. భారత్, ఇంగ్లాండ్ జట్లు టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్?లో తలపడటం ఇది వరుసగా మూడోసారి. 2022లో అడిలైడ్?లో జరిగిన సెమీస్?లో ఇంగ్లాండ్ 10 వికెట్ల తేడాతో భారత్?ను చిత్తు చేయగా, 2024లో జార్జ్ టౌన్ వేదికగా జరిగిన పోరులో భారత్ 68 పరుగులతో ప్రతీకారం తీర్చుకుంది. ఈ నేపథ్యంలో సామ్ కరన్ మాట్లాడుతూ 2022లో తాము ఆడిన ఆ 'పర్ఫెక్ట్ గేమ్'ను మళ్లీ రిపీట్ చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆ రోజు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారని, జోస్ బట్లర్, అలెక్స్ హేల్స్ అద్భుతమైన బ్యాటింగ్?తో భారత్?ను ఓడించినట్లు గుర్తు చేసుకున్నారు. ఈ మ్యాచ్?లో తమ జట్టు నుంచి ఒక పర్ఫెక్ట్ గేమ్ వస్తుందా లేదా అనే విషయం తనకు అనవసరమని సామ్ కరన్ వ్యాఖ్యానించారు. "నాకు పర్ఫెక్ట్ గేమ్?తో పనిలేదు, ఏదో ఒక రకంగా మ్యాచ్ గెలిచి మరోసారి ప్రపంచకప్ ఫైనల్?కు చేరుకోవడమే నా ప్రధాన లక్ష్యం" అని కుండబద్దలు కొట్టారు. గత ఐదు వారాలుగా తాము పడుతున్న కష్టమంతా ఈ సెమీస్ గెలిచి ఫైనల్ చేరడానికేనని వివరించారు. గెలుపు కోసం ఎంతటి కష్టనష్టాలకైనా సిద్ధమని, వాంఖడే స్టేడియంలో భారత్?ను వారి సొంత ప్రేక్షకుల ముందే ఓడించి తీరుతామని సామ్ కరన్ ధీమా వ్యక్తం చేశారు. వాంఖడే స్టేడియం నరేంద్ర మోదీ స్టేడియం కంటే చిన్నదైనప్పటికీ, అక్కడి ప్రేక్షకులు చేసే సౌండ్ చాలా ఎక్కువగా ఉంటుంది. ముంబయి ప్రేక్షకుల మద్దతు సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియాకు కొండంత బలాన్ని ఇస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. సామ్ కరన్ వంటి ఆటగాళ్ల మైండ్ గేమ్స్?కు పడిపోకుండా, తమ సహజమైన ఆటతో ఇంగ్లాండ్?కు బుద్ధి చెప్పాలని టీమిండియా భావిస్తోంది. వెస్టిండీస్?పై సంజు శాంసన్ ఆడిన ఇన్నింగ్స్ ఇచ్చిన ఊపుతో భారత్ ఈ మ్యాచ్?లో కూడా పైచేయి సాధించాలని పట్టుదలతో ఉంది. సామ్ కరన్ విసిరిన ఈ 'సైలెన్స్' సవాల్ ను టీమిండియా స్వీకరించి, వాంఖడేలో ఇంగ్లాండ్ బౌలర్ల పని పడుతుందో లేదో చూడాలి.

# కీలక పోరుకు టీమిండియా సిద్ధం

**నేడు వాంఖడే మైదానం వేదికగా సెమీఫైనల్-2**

**ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనున్న భారత్**

**అభిషేక్ శర్మపై వేటు పడే అవకాశం!**



**ముంబై:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. ముంబైలోని వాంఖడే మైదానం వేదికగా గురువారం రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే సెమీఫైన్-2లో ఇంగ్లండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్ చేరనుండటంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా సన్నదమవుతున్నాయి. వెస్టిండీస్‌తో తమ ఆఖరి సూపర్-8 మ్యాచ్‌లో అసాధారణ ప్రదర్శనతో విజయం సాధించిన భారత్.. అదే జోరు కనబర్చి ఇంగ్లండ్‌ను మట్టికరిపించాలనుకుంటుంది. తద్వారా టీ20 ప్రపంచకప్ 2022 సెమీఫైనల్లో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటుంది. బలబలాల పరంగా ఇరు జట్లు పటిష్టంగా ఉండటంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. లీగ్ దశను భారత్ అజేయంగా ముగిస్తే.. సూపర్-8ను ఇంగ్లండ్ అజేయంగా ముగించి సెమీస్‌కు అర్హత సాధించింది. పేలవ ప్రదర్శనతో జట్టుకు భారంగా మారిన విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను తుది జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చాడు. విండీస్‌తో మ్యాచ్‌లో రెండు సునాయస క్యాచ్‌లను వదిలేసాడు. ఇప్పటి వరకు ఆడిన 6 మ్యాచ్‌ల్లో మూడు సార్లు డకౌట్ అయిన అభిషేక్ శర్మ 80 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉంది. ఆఫ్ స్పిన్నర్‌ను ఎదుర్కోవడంలో అభిషేక్ శర్మ తడబడుతున్నాడు. ఈ క్రమంలోనే అతన్ని పక్కనపెట్టి రింకూ సింగ్‌ను ఆడించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. కానీ టీమ్‌మేనేజ్‌మెంట్ ఆ సాహసం చేయకపోవచ్చు. ఎలాంటి మార్పులు లేకుండా గత కాంబినేషన్‌నే కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గత మూడు మ్యాచ్‌ల్లో తీవ్రంగా తడబడ్డాడు. ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. దాంతో వరుణ్ చక్రవర్తిని తప్పించి కుల్దీప్ యాదవ్‌ను ఆడిస్తారా? అనే చర్చ కూడా జరుగుతుంది. కానీ ఇంగ్లండ్‌పై వరుణ్ చక్రవర్తికి మెరుగైన రికార్డ్ ఉంది. కాబట్టి అతన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. అయితే వాంఖడే పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటుంది. అలా అని కుల్దీప్ యాదవ్‌ను ఆడిస్తే టీమిండియా బ్యాటింగ్ డెప్త్ తగ్గనుంది. కాబట్టి మరోసారి కుల్దీప్ యాదవ్‌కు నిరాశే ఎదురవ్వనుంది. టీ20ల్లో ఎక్స్‌ట్రా బ్యాటర్‌తో ఆడితే ప్రయోజనం ఉంటుందని టీమిండియా మేనేజ్‌మెంట్ గట్టిగా నమ్ముతుంది. వ్యూహాత్మకంగా కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలనుకుంటే వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్‌లో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. బ్యాటింగ్ లైనప్‌లో ఎలాంటి మార్పులు జరిగే ఛాన్స్ లేదు. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ ఆడనున్నారు. లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కోసం సంజూను తిరిగి ఆడించగా.. అతను కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్ ఆడాడు. అభిషేక్ శర్మ కూడా చెలరేగితే టీమిండియాకు తిరుగుండదు. ఇషాన్ కిషన్, సూర్య, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ మిడిల్, లోయార్డర్‌లో ఆడనున్నారు. రింకూ సింగ్ బెంచ్‌కే పరిమితం కానున్నాడు. సూర్య ఒత్తిడిని పక్కనపెట్టి స్వేచ్ఛగా ఆడాల్సిన అవసరం ఉంది. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ పేస్ బాధ్యతలు పంచుకోనుండగా.. హార్దిక్ అతనికి అండగా నిలవనున్నాడు. శివమ్ దూబేతో బౌలింగ్ వేయించలేని పరిస్థితి నెలకొంది. ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ ఎవరా? అనేది టీమిండియాకు సవాల్‌గా మారింది. సిరాజ్‌కు మరోసారి మొండి చెయ్యే ఎదురు కానుంది.

**ఇంగ్లండ్‌తో సెమీఫైనల్లో తలపడే భారత తుది జట్టు(అంచనా)**

అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా.

### హిస్టరీ క్రియేట్ చేయనున్న

## జస్‌ప్రీత్ బుమ్రా..



టీ20 ప్రపంచకప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనున్న రెండో సెమీఫైనల్ పోరుపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ మ్యాచ్ కేవలం భారత్ ఫైనల్ చేరుతుందా లేదా అన్నదానికే పరిమితం కాలేదు.. టీమిండియా గన్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా కెరీర్‌లో ఒక మైలు రాయిని చేరుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో బుమ్రా 500 వికెట్ల క్లబ్‌లో చేర డానికి సరిగ్గా ఒక్క అడుగు దూరంలో ఉన్నాడు. ఇప్పటివరకు భారత క్రికెట్ చరిత్రలో కేవలం ఏడుగురు బౌలర్లు మాత్రమే ఈ అరుదైన ఘనతను సాధించారు. ఇప్పుడు ఆ దిగ్గజాల సరసన బుమ్రా పేరు కూడా చేరబోతోంది. ప్రస్తుతం బుమ్రా గణాంకాలు చూస్తే.. మూడు ఫార్మాట్లు (టెస్టులు, వన్డేలు, టీ20లు) కలిపి మొత్తం 499 వికెట్లు పడగొట్టాడు. ఇందులో టెస్టుల్లో 234 వికెట్లు, వన్డేల్లో 149 వికెట్లు, టీ20 ఇంటర్నేషనల్స్‌లో 116 వికెట్లు ఉన్నాయి. ఇంగ్లాండ్‌తో జరిగే ఈ సెమీఫైనల్ మ్యాచ్‌లో బుమ్రా ఒక్క వికెట్ తీసినా, అంతర్జాతీయ స్థాయిలో 500 వికెట్ల మార్కును అందుకున్న ఎనిమిదో భారత బౌలర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఒక ఫాస్ట్ బౌలర్‌గా, అది కూడా గాయాల బెడదను తట్టుకుంటూ ఇన్ని వికెట్లు తీయడం బుమ్రాలోని అసాధారణ ప్రతిభకు నిదర్శనం. భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన జాబితాను పరిశీలిస్తే.. అనిల్ కుంబ్లే (956), రవిచంద్రన్ అశ్విన్ (765), హర్భజన్ సింగ్ (717), కపిల్ దేవ్ (687), రవీంద్ర జడేజా (634), జహీర్ ఖాన్ (610), జవగల్ శ్రీనాథ్ (551) వంటి దిగ్గజాలు ఉన్నారు. ఇప్పుడు బుమ్రా కూడా ఈ ఎలైట్ లిస్టులోకి చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా వాంఖడే వంటి బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై ఇంగ్లాండ్ బ్యాటర్లను కట్టడి చేయడంలో బుమ్రా పాత్ర కీలకం కానుంది. జోస్ బట్లర్ లేదా సాల్ట్ వంటి కీలక వికెట్లను బుమ్రా తన 500వ వికెట్‌గా మార్చుకుంటాడేమో చూడాలి. ఈ వరల్డ్ కప్ టోర్నీలో టీమిండియా ప్రదర్శన అద్భుతంగా సాగుతోంది. సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఒక్క ఓటమి మినహా, భారత్ అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించింది. ముఖ్యంగా సూపర్ 8 చివరి పోరులో వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీస్‌కు దూసుకొచ్చింది. అటు ఇంగ్లాండ్ కూడా బలంగా ఉంది. ఇలాంటి హై వోల్టేజ్ మ్యాచ్‌లో బుమ్రా తన పదునైన యార్కర్లతో ఇంగ్లాండ్ వికెట్లను పడగొట్టి భారత్‌ను ఫైనల్‌కు చేరుస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. బుమ్రా రికార్డుతో పాటు భారత్ గెలుపు కూడా తోడైతే వాంఖడేలో పండుగే పండుగ.

## అభిషేక్ శర్మపై వేటు పడే అవకాశం!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. ముంబైలోని వాంఖడే మైదానం వేదికగా గురువారం రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే సెమీఫైన్-2లో ఇంగ్లండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్ చేరనుండటంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా సన్నదమవుతున్నాయి. వెస్టిండీస్‌తో తమ ఆఖరి సూపర్-8 మ్యాచ్‌లో అసాధారణ ప్రదర్శనతో విజయం సాధించిన భారత్.. అదే జోరు కనబర్చి ఇంగ్లండ్‌ను మట్టికరిపించాలనుకుంటుంది. తద్వారా టీ20 ప్రపంచకప్ 2022 సెమీఫైనల్లో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటుంది. బలబలాల పరంగా ఇరు జట్లు పటిష్టంగా ఉండటంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. లీగ్ దశను భారత్ అజేయంగా ముగిస్తే.. సూపర్-8ను ఇంగ్లండ్ అజేయంగా ముగించి సెమీస్‌కు అర్హత సాధించింది. పేలవ ప్రదర్శనతో జట్టుకు భారంగా మారిన విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను తుది జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చాడు. విండీస్‌తో మ్యాచ్‌లో రెండు సునాయస క్యాచ్‌లను వదిలేసాడు. ఇప్పటి వరకు ఆడిన 6 మ్యాచ్‌ల్లో మూడు సార్లు డకౌట్ అయిన అభిషేక్ శర్మ 80 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉంది. ఆఫ్ స్పిన్నర్‌ను ఎదుర్కోవడంలో అభిషేక్ శర్మ తడబడుతున్నాడు. ఈ క్రమంలోనే అతన్ని పక్కనపెట్టి రింకూ సింగ్‌ను ఆడించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. కానీ టీమ్‌మేనేజ్‌మెంట్ ఆ సాహసం చేయకపోవచ్చు. ఎలాంటి మార్పులు లేకుండా గత కాంబినేషన్‌నే కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గత మూడు మ్యాచ్‌ల్లో తీవ్రంగా తడబడ్డాడు. ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. దాంతో వరుణ్ చక్రవర్తిని తప్పించి కుల్దీప్ యాదవ్‌ను ఆడిస్తారా? అనే చర్చ కూడా జరుగుతుంది. కానీ ఇంగ్లండ్‌పై వరుణ్ చక్రవర్తికి మెరుగైన రికార్డ్ ఉంది. కాబట్టి అతన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. అయితే వాంఖడే పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటుంది. అలా అని కుల్దీప్ యాదవ్‌ను ఆడిస్తే టీమిండియా బ్యాటింగ్ డెప్త్ తగ్గనుంది. కాబట్టి మరోసారి కుల్దీప్ యాదవ్‌కు నిరాశే ఎదురవ్వనుంది. టీ20ల్లో ఎక్స్‌ట్రా బ్యాటర్‌తో ఆడితే ప్రయోజనం ఉంటుందని టీమిండియా మేనేజ్‌మెంట్ గట్టిగా నమ్ముతుంది. వ్యూహాత్మకంగా కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలనుకుంటే వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్‌లో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. బ్యాటింగ్ లైనప్‌లో ఎలాంటి మార్పులు జరిగే ఛాన్స్ లేదు. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ ఆడనున్నారు. లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కోసం సంజూను తిరిగి ఆడించగా.. అతను కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్ ఆడాడు. అభిషేక్ శర్మ కూడా చెలరేగితే టీమిండియాకు తిరుగుండదు. ఇషాన్ కిషన్, సూర్య, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ మిడిల్, లోయార్డర్‌లో ఆడనున్నారు. రింకూ సింగ్ బెంచ్‌కే పరిమితం కానున్నాడు. సూర్య ఒత్తిడిని పక్కనపెట్టి స్వేచ్ఛగా ఆడాల్సిన అవసరం ఉంది. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ పేస్ బాధ్యతలు పంచుకోనుండగా.. హార్దిక్ అతనికి అండగా నిలవనున్నాడు. శివమ్ దూబేతో బౌలింగ్ వేయించలేని పరిస్థితి నెలకొంది. ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ ఎవరా? అనేది టీమిండియాకు సవాల్‌గా మారింది. సిరాజ్‌కు మరోసారి మొండి చెయ్యే ఎదురు కానుంది.

**ఇంగ్లండ్‌తో సెమీఫైనల్లో తలపడే భారత తుది జట్టు(అంచనా)**

అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా.

## పాక్ క్రికెట్‌లో కలకలం..



టీ20 వరల్డ్ కప్ 2026లో నిరాశాజనక ప్రదర్శన తర్వాత పాకిస్థాన్ క్రికెట్‌లో భారీ మార్పులు మొదలయ్యాయి. ఈ పరిణామాల్లో భాగంగా పాకిస్థాన్ సెలక్షన్ కమిటీ సభ్యుడు, మాజీ అంతర్జాతీయ అంపైర్ అలీం దార్ తన పదవికి రాజీనామా చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు లో సెలెక్టర్‌గా 2024లో చేరిన అలీం దార్, కమిటీలో జరుగుతున్న అంతర్గత వ్యవహారాలు, నిర్ణయాల్లో స్వేచ్ఛ లేకపోవడమే రాజీనామాకు ప్రధాన కారణమని తెలిపారు. టీ20 వరల్డ్ కప్ 2026లో పాకిస్థాన్ జట్టు సూపర్-8 దశలోనే బయటపడింది. ముఖ్యంగా భారత్, ఇంగ్లాండ్ జట్లపై వచ్చిన ఓటములు జట్టుపై తీవ్ర విమర్శలకు దారి తీశాయి. ఇప్పటికే జట్టు ఆటగాళ్లపై పీసీబీ భారీ జరిమానాలు విధించిన నేపథ్యంలో, అలీం దార్ రాజీనామా పాకిస్థాన్ క్రికెట్‌లోని అంతర్గత సమస్యలను బహిర్గతం చేసినట్టుగా భావిస్తున్నారు. పాకిస్థాన్ మీడియా నివేదికల ప్రకారం, టీ20 వరల్డ్ కప్ జట్టు ఎంపిక సమయంలో అలీం దార్ కొన్ని కీలక నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉన్నారు. ముఖ్యంగా సీనియర్ ఆటగాళ్లు బాబర్ ఆజమ్, షాదాబ్ ఖాన్ ఎంపికను ఆయన తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. వారి తాజా ప్రదర్శనలను దృష్టిలో ఉంచుకుంటే జట్టులో స్థానం ఇవ్వకూడదని దార్ అభిప్రాయపడ్డారని సమాచారం. బదులుగా వికెట్ కీపర్-బ్యాటర్ మొహమ్మద్ రిజ్వాన్‌ను నంబర్-6 స్థానంలో స్పష్టమైన పాత్రతో ఆడించాలనే సూచన చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఈ సూచనలను పట్టించుకోకపోవడంతో చివరకు బాబర్ ఆజమ్, షాదాబ్ ఖాన్ జట్టులో చోటు దక్కించుకున్నారు. టోర్నమెంట్‌లో వారి ప్రదర్శన కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడం విమర్శలకు దారితీసింది. అలీం దార్ అసంతృప్తికి మరో ప్రధాన కారణం హెడ్ కోచ్ మైక్ హెసన్ జోక్యం అని సమాచారం. జట్టు ఎంపికలో కోచ్ అధిక ప్రభావం చూపడం వల్ల సెలక్షన్ కమిటీ స్వతంత్రత తగ్గిందని ఆయన భావించినట్లు తెలుస్తోంది. సెలెక్టర్ ఆకిబ్ జావేద్ మద్దతుతో హెసన్ నిర్ణయాలు తీసుకోవడం దార్‌కు నచ్చలేదని నివేదికలు చెబుతున్నాయి. ఇప్పటికే సెలక్షన్ కమిటీ సభ్యులు ఆకిబ్ జావేద్, అసద్ షఫీక్, డేటా అనలిస్ట్ ఉస్మాన్ హష్మీ మాత్రమే మిగిలారు. ఈ నేపథ్యంలో పీసీబీ తమ సెలక్షన్ వ్యవస్థలో కీలక మార్పులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. అలీం దార్ రాజీనామా పాకిస్థాన్ క్రికెట్‌లో కొనసాగుతున్న అంతర్గత విభేదాలకు స్పష్టమైన సంకేతంగా మారింది.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI





# కమల్, రజనీ మూవీపై సర్వత్రా ఆసక్తి

## వచ్చే యేడు షూటింగ్ మొదలవుతుందని టాక్

46 ఏళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత లెజెండరీ యాక్టర్లు కమల్ హాసన్, రజనీకాంత్ కాంబోలో సినిమా వస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'జైలర్'ఫేం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ప్రతీ రోజు ఏదో ఒక అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై హైప్ పెంచేస్తోంది. తాజా న్యూస్ ఒకటి మూవీ లవర్స్‌తోపాటు అభిమానుల్లో క్యూరియాసిటీ రేకెత్తిస్తుంది. సినిమా షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా..? అని ఎదురు చూస్తున్నఅభిమానుల కోసం అదిరిపోయే వార్త షేర్ చేశాడు మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్. ఈ టాలెంటెడ్ కంపోజర్ ప్రకారం ఈ మూవీ షూట్ వచ్చే ఏడాది మొదలు కానుందని చెప్పాడు. ప్రస్తుతం రజినీకాంత్, కమల్ హాసన్ తమ కమిట్‌మెంట్స్ పూర్తి చేసుకున్న తర్వాత ఈ ప్రాజెక్ట్ షూటింగ్‌లో చేరనునున్నారని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తోంది. కాగా ఈ సినిమాని 80స్, 90స్‌లో ఉపయోగించిన ఫిల్మ్ కెమెరాలతో షూట్ చేయనున్నారంటూ ఓ క్రేజీ అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. నెల్సన్, రాజీవ్ మీనన్ ఇప్పటికే ప్రోమోను ఇదే పద్ధతిలో షూట్ చేయాలనుకున్నా.. టైం తక్కువగా ఉండటం వల్ల డిజిటల్ మెథడ్‌లో ప్రోమోను తెరకెక్కించారని ఇన్‌సైడ్ టాక్. మల్టీస్టారర్ స్పెషల్ గ్లింప్స్ కూడా విడుదల చేయగా.. గ్లింప్స్‌లో కమల్-రజనీ ఇద్దరూ ఎవరు స్టైల్‌లో వారు కనిపిస్తూ.. కాస్ట్యూమ్స్, బూట్లు, బెల్ట్, వాచ్, కళ్లద్దాలతో ఒకరినొకరు డామినేట్ చేసుకునేలా కనిపిస్తూ సందడి చేస్తున్నారు.

# యశ్ టాక్సిస్ జూన్‌కి వాయిదా




యశ్ హీరోగా రానున్న తాజా సినిమా 'టాక్సిక్' గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ చిత్రం వాయిదా పడింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టింది. మొదట ఈ మూవీని మార్చి 19న విడుదల చేయాలని భావించారు. కానీ, ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా దీన్ని జూన్ 4కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 'మేం ఈ 'టాక్సిక్'ను అన్ని భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్‌లోనూ రిలీజ్ చేయాలి. ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు అందరికీ తెలిసినవే. ఇలాంటి సమయంలో సినిమాను విడుదల చేయడం సరైన నిర్ణయం కాదు. అందుకే వాయిదా వేస్తున్నాం' అని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఇక ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించ నుండగా హ్యూమా ఖురేషీ ఎలిజిబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.

# మణిపురి బూంగ్‌కు బ్రిటిష్ అకాడమీ అవార్డు

మణిపురి భాషలో తెరకెక్కిన 'బూంగ్' చిత్రం ప్రతిష్టాత్మకమైన బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ 2026 అవార్డుల్లో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం 'బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ ఫిల్మ్' కేటగిరీలో విజేతగా నిలవడమే కాకుండా బాఎ÷-టా గెలుచుకున్న తొలి భారతీయ సినిమాగా చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత విజయం తర్వాత మేకర్స్ ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ప్రపంచ వేదికపై భారతీయ ప్రాంతీయ సినిమా సత్తాను చాటిన ఈ చిత్రం మార్చి 6న థియేటర్లలోకి రాబోతుంది. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ప్రముఖ నిర్మాతలు ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వానీ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించగా, లక్ష్మీప్రియ దేవి దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే, మణిపూర్‌లోని ఒక మారుమూల గ్రామానికి చెందిన 'బూంగ్' అనే చిన్నారి చుట్టూ కథ తిరుగుతుంది. తన తల్లి ముఖంలో చిరునవ్వు చూడాలని తపించే ఆ బాలుడు, ఆమెకు ఇచ్చే అత్యంత విలువైన బహుమతి తన తండ్రిని తిరిగి ఇంటికి తీసుకురావడమేనని బలంగా నమ్ముతాడు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలిసి తండ్రి కోసం అతడు చేసే అన్వేషణ, ఆ ప్రయాణంలో ఎదురయ్యే అనుభవాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. దర్శకురాలు లక్ష్మీప్రియ దేవి చిన్నపిల్లల అమాయకత్వాన్ని, వారిలోని స్వచ్ఛమైన ప్రేమను అత్యంత సహజంగా వెండితెరపై ఆవిష్కరించారు.





# సాంప్రదాయిని సుప్పిని సుద్దిపూసని ఓ మంచి చిత్రం

## నటుడు శివాజీ వెల్లడి

శివాజీ, లయ మరోసారి నవ్వులు పంచేందుకు సిద్ధమయ్యారు. వారిద్దరూ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీగా రూపొందిన ఈ సినిమా థియేటర్లలో ఈనెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో శివాజీ మాట్లాడుతూ మన దేశంలో వినోదం అనగానే సినిమానే గుర్తుకొస్తుందన్నారు. ఈటీవీ విన్ నుంచి సినిమా వస్తుందంటే ఆడియన్స్‌లో ఆసక్తి రెట్టింపు అవుతుంది. వారికి మరింత వినోదం ఇవ్వడం కోసం ఈటీవీ విన్ ప్రత్యేక ఆఫర్‌ను కూడా ప్రకటించింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.499కే నాలుగు టికెట్స్‌తోపాటు లార్జ్ పాప్‌కార్న్, ఎంపిక చేసిన మల్టీప్లెక్స్‌ల్లో రూ.799కే నాలుగు టికెట్స్‌తోపాటు లార్జ్ పాప్‌కార్న్ అందించాలని నిర్ణయించుకుంది. సినిమా అందరికీ చేరువకావాలనే ఈ ఆఫర్‌ను 'ఈటీవీ విన్' బిజినెస్ హెడ్ సాయికృష్ణ ప్రకటించారు. సినిమా థియేటర్‌లలో పాప్‌కార్న్ అనేది చాలా పెద్ద ఇష్యూ.. దాన్ని ఈటీవీ విన్ సెట్ చేసేసింది. ఈ సినిమా కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది. కుటుంబసమేతంగా చూసి ఎంజాయ్ చేసే చిత్రమిది. నేను ఈ సినిమాకు ఖర్చు పెట్టాల్సింది అంతా కూడా స్క్రీన్ మీదే పెట్టాను. ఒక్కోసారి టీచర్‌లా ప్రవర్తించాను. అలా ఉండడానికి కారణం.. ఒక గొప్ప సంస్థ నన్ను నమ్మి నాకు ఓ బాధ్యత ఇచ్చినప్పుడు వాళ్లకు మంచి అవుట్‌పుట్ ఇవ్వాలి. అందుకే ఈ సినిమాకు మరింత కష్టపడి వర్క్ చేశాను. వాళ్లకు మాట ఇచ్చినట్లు మంచి చిత్రం తీశాను. ఈ ఆఫర్‌ను మాత్రం అందరూ గుర్తుపెట్టుకోండి అని అన్నారు.



# రైరై రారా పాటకు భారీగా లైక్స్

పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విలేజ్ బ్యాక్‌డ్రాప్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ కలయికతో రూపొందుతున్న ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా విడుదలైన సెకండ్ సింగిల్ 'రై రై రా రా' లిరికల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి రికార్డులు సృష్టిస్తోంది. ఈ పాటకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చి స్వయంగా ఆలపించడం విశేషం. అనంత శ్రీరామ్ అందించిన సాహిత్యం మాస్, మోటివేషనల్ టచ్‌తో ఆకట్టుకుంటోంది. జానీ మాస్టర్ రూపొందించిన కొరియోగ్రఫీ ఈ సాంగ్‌కు హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా రామ్ చరణ్ వేసిన గ్రేస్‌ఫుల్ స్టెప్పులు, ఫాస్ట్ మూమెంట్స్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి. కొందరు అభిమానులు ఆయన డ్యాన్స్‌ను 'చిరుత' రోజుల్ని గుర్తు చేసేలా ఉందని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఈ పాటపై మెగాస్టార్ చిరంజీవి కూడా ప్రశంసలు కురిపించారు. 'రై రై రా రా' సాంగ్ ఎనర్జీ, ఎమోషన్, సినీమాటిక్ బ్రిలియన్స్‌తో అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. రామ్ చరణ్ డ్యాన్స్ తనను ఎంతో గర్వపడేలా చేసిందని, స్క్రీన్‌పై ఆయన గ్రేస్ ప్రత్యేకంగా మెరిసిందని వ్యాఖ్యానించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా, ఏఆర్ రెహమాన్ సంగీతం, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ అందరి కృషి వల్లే ఈ సాంగ్ మరోస్థాయికి వెళ్లిందని అభినందించారు. ఈ ప్రశంసలకు బుచ్చిబాబు సానా భావోద్వేగంగా స్పందిస్తూ, మెగాస్టార్ నుంచి వచ్చిన మాటలు జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు. రికార్డుల విషయానికి వస్తే, విడుదలైన 24 గంటల్లోనే 'రై రై రా రా' లిరికల్ వీడియో 46.1 మిలియన్ వ్యూస్ సాధించి టాలీవుడ్‌లో అత్యధిక వ్యూస్ అందుకున్న లిరికల్ సాంగ్‌గా నిలిచింది. మాస్ బీట్, ఎనర్జిటిక్ ట్యూన్, రామ్ చరణ్ డ్యాన్స్ అన్నీ కలిసి ఈ రికార్డు సాధించడంలో కీలక పాత్ర పోషించాయి. అయితే టాప్ లిరికల్ వ్యూస్ జాబితాలో రెండో స్థానంలో కూడా 'పెద్ది' చిత్రానికే చెందిన 'చికిరి చికిరి' పాట 29.19 మిలియన్ వ్యూస్‌తో నిలవడం విశేషం.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

TGTEL/25/A1737 | NETI SAKSHI

## విద్యుత్ సరఫరాలో సిబ్బంది సేవలు ఘనం. ఏఈ

**ఘనంగా లైన్‌మ్యాన్ దివస్ నిర్వహణ**



**నేటి సాక్షి, ఎండపల్లి:** విద్యుత్ సరఫరాలో అహర్నిశలు శ్రమిస్తూ ప్రజలకు నిరంతరాయంగా సేవలందిస్తున్న సిబ్బందిని సత్కరిస్తూ లైన్‌మ్యాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఎండపల్లి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజరాంపల్లి విద్యుత్‌శాఖ ఏఈ బండి సమ్మయ్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఏఈ సమ్మయ్య మాట్లాడుతూ.. ఎండలు, వానలు, గాలివానలు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో సిబ్బంది చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి ప్రజలకు వెలుగు అందించడం గొప్ప సేవగా పేర్కొన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఉత్తమంగా సేవలందించిన లైన్ మ్యాన్, సిబ్బందిని శాఖ తరుపున శాలువాలతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. సిబ్బంది తమ సేవలను గుర్తించి గౌరవించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలందిస్తామని హామీ ఇచ్చారు.

## తంగేడంచ గ్రామంలోని జైన్ ఇరిగేషన్‌ను సందర్శన

**ఏపి మోడల్ స్కూల్ విద్యార్థులు**



**నేటి సాక్షి జూపాడుబంగ్లా:** నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలంలోని తంగడంచ గ్రామంలోని జైన్ ఇరిగేషన్ పరిశ్రమను బుధవారం రోజున పాములపాడు ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ప్రభుత్వం ఈ సంవత్సరం 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు పాలిటెక్నిక్ లాంటి నూతనంగా సాంకేతిక విద్య కోర్సులను ప్రీ వొకేషనల్ ఎడ్యుకేషన్ ద్వారా ప్రవేశ పెట్టట్టింది. దీనికి అణుగుణంగా పాఠ్యంశాలలో ప్రధానంగా మొదటి అధ్యాయంలోనే వ్యవసాయ, అనుబంధ విషయాలపై ప్రత్యేక పాఠ్యాంశాన్ని చేర్చింది. ఈ మేరకు వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాములపాడు ఎపి మోడల్ స్కూల్ వొకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో జైన్ పరిశ్రమలోని వ్యవసాయ అనుబంధ క్రింద బిందు, తుంపర్ల సేద్యంపై అవగాహన కార్యక్రమానికి సుమారు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జైన్ పరిశ్రమ ఇంచార్జి మహేష్, లైజనింగ్ ఆఫీసర్ మౌలాలి, జైన వ్యవసాయ నిపణులు తావణ్ కుమార్ షాసీర్ బాష, చైతన్య, రఫి, రాఘు వేంద్ర, విల్సన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహోన్నత చరిత్ర కలిగిన ప్రాంతం గాంధారి ఖిల్లా

**ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్**



**నేటి సాక్షి, మంచిర్యాల జిల్లా:** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని గాంధారి ఖిల్లాకు మహోన్నత చరిత్ర ఉందని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐ టి డి ఎ ప్రాజెక్టు అధికారి కార్యాలయ చాంబర్ లో ఆదివాసీ నాయకపోడు ప్రతినిధులు కొమ్మ భీమన్న, నాల్నేని రమణ, పుస్తక రచయిత మేసినేని రాజన్న లతో కలిసి గాంధారి ఖిల్లా చరిత్ర భాగం-1 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ పూర్వకాలం ఈ ప్రాంతంలో పాండవులు పర్యటించినట్లు చరిత్ర ఉందని, గిరిజనులు పాండవులను ఆరాధ్య దైవాలుగా కొలుస్తారని తెలిపారు. తెలంగాణలో వనదేవతలను కొలిచే ఆచారం ప్రసిద్ధి పొందిందని, ఈ క్రమంలో గాంధారిఖిల్లా మైసమ్మను దేవతగా కొలుస్తారని తెలిపారు. మహోన్నత చరిత్ర కలిగిన గాంధారి ఖిల్లా ప్రాంత వైభవాన్ని, చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో పుస్తక రచన చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సాకేర సర్పంచ్, పుస్తక సహాయ రచయిత దయనేని రమేష్, ఆదివాసి నాయకపోడు సాంస్కృతిక కళ అభివృద్ధి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అనూష మృతిపై విచారణ జరపాలి

## ప్రజా సంఘాలు నాయకులు డిమాండ్.



**నేటి సాక్షి వికారాబాద్ :** గిరిజన బాలిక అనూష మృతి పై విచారణ జరపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ భూ యజమాని అంతమొల్ల దయాకర్ రెడ్డి బలవంతంగా 14 సంవత్సరాలు నిండని అనూషతో పనిచేయించుకోవడం వల్లనే ఆమె మృతి చెందిందని అన్నారు. స్వయానా రాజకీయ నాయకుడైన ఆయన బాధితుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారికి అతి తక్కువ వేతనం చెల్లిస్తూ పని చేయించుకున్నారని తెలిపారు. పనికి వెళుతున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడి గిరిజన బాలిక అనూష మృతి చెందడానికి దయాకర్ రెడ్డి పూర్తి బాధ్యుడని పేర్కొన్నారు. పోలీసులు మాత్రం దీనిని సాధారణ యాక్సిడెంట్ కేసుగా నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఆమెను బాల కార్మికురాలిగా నిర్ధారించడంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. రాజకీయ అండదండలు ఉండడంతోనే దయాకర్ రెడ్డి పై బాలల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేయడానికి పోలీసులు వెనుకాడుతున్నారని అన్నారు. అధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి ఆమెను బాల కార్మికురాలిగా గుర్తిస్తూ బాధ్యుడైన దయాకర్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలోనే నవాబ్ పేట్ మండల కేంద్రంలో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పోరాటానికి కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీత, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ బి.శివరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుట్టకింది రవికుమార్, విహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీకాంత్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉమ, జామ దశరథ్, శ్రీనివాస్, బి.నరేందర్, ఎ.మల్లేష్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## లలితమాత ఆలయాన్ని దర్శిస్తే పాపాలు హరిస్తాయి

- పొలాసలో నేడు చండిహోవనం, 6న శివపార్వతుల కళ్యాణం
- ఆలయ ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప వెల్లడి



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్, (పూరెళ్ల బాపు ):** జగిత్యాల రూరల్ మండలం పొలాసలో కొలువై ఉన్న 108 శ్రీచక్ర సహిత లలితామాత ఆలయాన్ని సందర్శిస్తే సకల పాపాలు హరిస్తాయని ఆలయ ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య తెలిపారు.లలితమాత ఆలయ 3 వ వార్షికోత్సవ వేడుకలు నేడు, రేపు జరుగుతాయని భక్తులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సకల దేవతల శక్తులన్నీ ఒకే దగ్గర ఒకే శక్తిగా 9 అవరణలతో బిందు స్వరూపంగా ఒక శ్రీ చక్రంగా అమ్మవారు వెలిశారని తెలిపారు. కానీ పొలాస ఆలయంలో 27 నక్షత్రాల, 4 పాధాలుగా 108 నామాలతో పూర్ణత్వశీగా వెలిసిన మన లలితమాత ఆలయాన్ని దర్శించుకుంటే పాపాలు తొలుగుతాయని స్పష్టం చేశారు. నేడు చండీ హోవనం, 6 న లలితసాహస్ర నామ పారాయణం అనంతరం శివపార్వతుల కళ్యాణం జరుగుతుందని తెలిపారు.ఆలయంలో ఉత్సవాలు శ్రీమాన్ నంబీ వేణుగోపాల చార్య కౌశిక మంగళశాషణమూలతో బ్రహ్మశ్రీ తీగుళ్ల విషు శర్మ వైదిక నిర్వహణలో జరుగుతాయాని స్వరూప వివరించారు.

## ఆరె మల్లయ్య మృతి తీరని లోటు!

**మల్లయ్య ఆశయాలు సాధించాలి జుట్టు కొండ**



**నేటి సాక్షి చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం, రామాపురం కు చెందిన ఆరే మల్లయ్య మృతి కుటుంబానికి తీరని లోటు అని, ఆయన ఆశయాలు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బిజెపి సీనియర్ నాయకులు, సూర్యాపేట మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టు కొండ సత్యనారాయణ అన్నారు, రామాపురంలో బుధవారం ఆరే మల్లయ్య పెద్దకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏనుగుల వీరాంజనేయులు ,సీనియర్ జర్నలిస్ట్ మదూరి వెంకటేశ్వరరావు, చిలుకూరు మండల బిజెపి నాయకులు తీపిరి శెట్టి. బసవయ్య, కొండ శీను, మహేష్ , ఆరే వెంకటేశ్వర్లు(బాబు), తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# మున్సిపల్ పాలకవర్గానికి అయ్యప్ప ఆశీస్సులుండాలి



- అయ్యప్ప స్వామి శక్తి స్వరూపుడు
- సన్మాన సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ వాణి

**నేటి సాక్షి - జగిత్యాల టౌన్, (పూరెళ్ల బాపు ):** అయ్యప్ప స్వామి శక్తి స్వరూపుడని ఆయన ఆశీస్సులు మా మున్సిపల్ పాలకవర్గానికి ఎల్లప్పుడూ ఉండాలని జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కోరారు. జగిత్యాల అయ్యప్ప ఆలయంలో బుధవారం జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి -శ్రీనివాస్ దంపతులు, పట్టణ వార్డ్ కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మనోత్తముల ఆశీర్వచనాలతో వారిని ఘనంగా సన్మానించారు. ఆలయంలోకి రాగానే మాకు గొప్ప శక్తి వచ్చినట్లయిందని, ఆశక్తి అయ్యప్ప స్వామి అని పేర్కొన్నారు.ఆలయంలో ప్రశాంతత, ఆనందం పొందామని తెలిపారు.అయ్యప్ప స్వామి ఆశీస్సులతో జగిత్యాల పట్టణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, జగిత్యాల మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందాలని, అందుకు అయ్యప్పస్వామి దీవెనలు మాకు ఉండాలని వాణి వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో ఛైర్పర్సన్ వాణి తో పాటు కౌన్సిలర్లు బోయినిపెల్లి ప్రశాంత్ రావు, కోరుకంటి రామ్, వారణాసి మల్లవ్వ తిరుమలయ్య, ఆరవ లక్ష్మి రాజు, మానపురి పవిత్ర మహేష్, అల్లాల సరిత రమేష్ రావు,గాజుల లావణ్య మహేష్,దయ్యాల చంద్రకళ శంకర్, బైర్నేని భాగ్య, కొండా రమ లక్ష్మణ్,మమత రామకృష్ణ రెడ్డి, పిట్ట ధర్మరాజు, క్యాదాసు నవీన్,సీనియర్ గురు స్వాములు బండారి లక్ష్మినారాయణ, నీలం దశరథ రెడ్డి, మానాల కిషన్, దిటి సతీష్, మార కైలాసం, శ్రీనివాస్, సంకోజీ వెంకట రమణ, పాంపట్టి రవీందర్, పూజారి లక్ష్మీపతి, అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో 'డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్' ప్రారంభం

- ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం!





**నేటి సాక్షి నంద్యాల:** నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకట రమణ .జిల్లాలో చిన్నారుల్లో జన్మతహ లోపాలు, శారీరక వైకల్యాలు, ఎదుగుదల లోపాలు,మానసిక సమస్యలు, వినికిడి-మాట లోపాలు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికారి పేర్కొన్నారు.. ఈ DEIC కేంద్రంలో 0నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు,అవసరమైన చికిత్సలు,ఫిజియోథెరపీ,స్పీచ్ థెరపీ,కౌన్సెలింగ్ వంటి సేవలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.ప్రత్యేక నిపుణుల బృందం ద్వారా పిల్లల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి,అవసరమైన చికిత్సా ప్రణాళిక రూపొందించనున్నామని తెలిపారు..అదేవిధంగా జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు,పాఠశాలలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గుర్తించిన పిల్లలను ఈ ణజు×జ కేంద్రానికి రిఫర్ చేసి మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వైద్య శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.. జిల్లాలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఇది ఒక కీలక ముందడుగని,తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకట రమణ విజ్ఞప్తి చేశారు.

# 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమం



- మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యాచరణ
- సమగ్ర ప్రణాళికలతో ముందుకు రావాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణను లక్ష్యసాధన దిశగా కచ్చితత్వంతో అమలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, సేవల వేగవంతమైన అందుబాటు, కార్యాలయాల శుద్ధి, సంక్షేమ పథకాల పారదర్శక అమలు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ & బి, ఇరిగేషన్, వ్యవసాయం, ఉద్యానవనం, విద్య, వైద్య, హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్, మహిళా-శిశు సంక్షేమ, మెప్మా, మున్సిపాలిటీలు తదితర శాఖల జిల్లా స్థాయి అధికారులతో ప్రాథమిక సమీక్షా సమావేశం నిర్వహించారు. 99 రోజుల్లో చేపట్టాల్సిన పనుల లక్ష్యాలను వివరంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్, ప్రతి శాఖ తమ కార్యాచరణ ప్రణాళికను రేపు సాయంత్రం లోగా సమర్పించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, అన్ని కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను వేగంగా పరిష్కరించాలన్నారు. కార్యాలయ భవనాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, టాయిలెట్ల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పార్కింగ్ స్థలాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉపయోగంలో లేని ఫర్నిచర్, వస్తువులను తొలగించాలని ఆదేశించారు. అంగన్వాడీలు - మహిళా శక్తి భవనాలు - సంక్షేమ చర్యలు అంగన్వాడీ కేంద్రాల సదుపాయాలపై మండలాల వారీగా నివేదికలు సమర్పించాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాల వివరాలు, మరమ్మత్తులు, విద్యుత్, త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎస్ఏవీ, హీఏవీ పిల్లల శాతం 100% తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాల్యవివాహాల నియంత్రణ, అన్ని శాఖల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు, ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఐడి కార్డుల జారీపై డిడబ్ల్యూఓకు సూచనలు ఇచ్చారు. మహిళా సంఘాల బలోపేతానికి 60 రోజుల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలను పూర్తి చేయాలని, నమోదు కాని సభ్యులను చేర్చాలని డిఆర్డిఓ, మెప్మా అధికారులను ఆదేశించారు. గ్రామీణ-పట్టణ ప్రాంతాల్లో రుణమేళాలు నిర్వహించేందుకు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అనుమతులు పొందిన గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాలు, సిసి రోడ్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని డిఆర్డిఓ, ఈఈపిఆర్ అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే అనుమతులు తీసుకున్న పనులను పూర్తి చేయడం, అవసరమైన పనులకు అనుమతులు పొందడం పై దృష్టి పెట్టాలని ఆర్ & బి అధికారులను సూచించారు. జిల్లాలో మహిళలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, ఆర్‌బిఎస్‌కే బృందాలు సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ వసతిగృహాల్లో పిల్లలకు పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించాలని డిఎంహెచ్ఓ, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, హాస్పిటల్ సూపరింటెండెంట్‌లకు సూచించారు. అవసరమైన వైద్యులు, పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. యువతలో నాయకత్వ లక్షణాల పెంపుకు 5కే, 2కే రన్‌లు, యోగా కార్యక్రమాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల వినియోగం పెంచాలని డివైఎస్ఓను ఆదేశించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. రోడ్ల పరిశుభ్రత, మురికి కాలువల శుభ్రత, వీధి దీపాల నిర్వహణ, నిరుపయోగ బావుల పూడ్చివేత, బోర్‌వెల్లుల మరమ్మత్తు, వాహనాల సర్టిఫికేషన్ లేదా తుక్కు తరలింపు వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జనన-మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి నిర్మాణ అనుమతులు, వీధి కుక్కల వ్యాక్సినేషన్, పోస్టర్ల తొలగింపు వంటి అంశాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిపిఓ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రతి ఇంటికి సురక్షిత త్రాగునీరు అందేలా సమన్వయం చేసుకోవాలని, వేసవి దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారులు త్వరితగతిన గృహనిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. పంట మార్పిడి విధానం, ఆర్గానిక్ వ్యవసాయం, పామాయిల్ సాగు, నానో యూరియా వినియోగం వంటి అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను గ్రామసభలు, వార్డు సభల్లో చదివి వినిపించాలని సూచించారు. మహాలక్ష్మి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, షాది ముబారక్, కళ్యాణలక్ష్మి, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, రైతు భరోసా వంటి పథకాల లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. ఈ 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ద్వారా జిల్లా స్థాయిలో గణనీయమైన మార్పు కనిపించాలని, అన్ని స్థాయిల అధికారులు రోజువారీ నివేదికలు సమర్పించాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మరియు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పీఎం-సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథం ప్రారంభం





- జగిత్యాలలో కరపత్రావిష్కరణ - అవగాహనకు శ్రీకారం
- రూఫ్‌టాప్ సోలార్‌తో బిల్లులు తగ్గించుకోండి: జిల్లా కలెక్టర్ పిలుపు

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో:( రాధారపు నర్సయ్య )** దేశవ్యాప్తంగా ఒక కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రజల్లో విస్తృతంగా చేర్చేందుకు జగిత్యాల జిల్లాలో ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కరపత్రాన్ని ఆవిష్కరించి, ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్‌టాప్‌పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడమే కాకుండా కార్బన్ ఉద్గారాలను జీరో స్థాయికి తీసుకురావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌కో మేనేజర్ డి. మనోహర్ మాట్లాడుతూ, 3 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల వరకు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. నెలకు సగటున రూ.2 వేల వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని, మొత్తం పెట్టుబడి సుమారు ఆరు సంవత్సరాల్లో తిరిగి వస్తుందని వివరించారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమై, దీర్ఘకాలికంగా లాభదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం విద్యుత్ ఉత్పత్తి దిశగా ప్రతి కుటుంబం అడుగులు వేయాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, డిపిఆర్ఓ నరేష్, డిపిఓ మదన్ మోహన్, డివైఎస్ఓ రవికుమార్, రెడ్‌కో అధికారులు పాల్గొన్నారు. అలాగే జగిత్యాల డీఈ గంగారాం, ఏడీఈ జవహర్ నాయక్, తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) సిబ్బంది హాజరయ్యారు.

# రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల పారితోషికం




- 'రహ్ వీర్' పథకం ద్వారా గుడ్ సమారిటన్స్‌కు ప్రోత్సాహం
- గోల్డెన్ అవర్‌లో సహాయం చేస్తే ప్రాణాలు రక్షణ: జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహ్ వీర్' పథకం ద్వారా రూ.25 వేల నగదు పారితోషికం ప్రశంసా పత్రం అందజేయబడుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. సమాజంలో మానవత్వాన్ని పెంపొందించడమే ఈ పథక ప్రధాన ఉద్దేశమని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారని, ఈ సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని వివరించారు. కొంతమంది పౌరులు పోలీసు కేసుల భయంతో సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని, అలాంటి భయాలు అవసరం లేదని స్పష్టం చేశారు. సహాయం చేసిన వారికి చట్టపరమైన ఇబ్బందులు లేవు 'రహ్ వీర్' పథకం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి రూ.25 వేల నగదు ప్రోత్సాహం, ప్రశంసా పత్రం అందజేయబడుతుందని తెలిపారు. సహాయం చేసిన వ్యక్తిపై ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టంచేశారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యక్రమంలో భాగస్వామి కావాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు.

## విద్యుత్ షాకుతో వ్యక్తి మృతి..



**నేటి సాక్షి కోదాడ (అనంతగిరి):** కోళ్ల ఫామ్ లో విద్యుత్ షాకుతో ఒకవ్యక్తి మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. అస్సాం రాష్ట్రానికి చెందిన జలాలుద్దీన్ కోళ్ల ఫామ్‌లో పనిచేస్తున్నాడు. షెడ్ క్లీన్ చేస్తున్న సమయంలో విద్యుత్ మోటార్ ఫెయిల్ అయ్యి, షార్ట్ సర్క్యూట్ కావడం వలన షాక్ వచ్చిందని, అక్కడికక్కడే మృతి చెందినట్లుగా సమాచారం. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లుగా పోలీసులు తెలిపారు.

## యువకుడు పై కత్తితో దాడి...

### ముగ్గురు పై కేసు నమోదు... రిమాండ్






**నేటి సాక్షి, తిరుమలాయపాలెం, (రుద్రరాజు):** పాత కక్షల నేపథ్యంలో యువకుడు పై దాడి చేసి గాయపరిచిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన కుందూరు లాలు S/o లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం మంగళవారం సాయంత్రం సుమారు 6:00 గంటల సమయంలో బీరోలు కమ్యూనిటీ హాల్ ముందు తన కొడుకు అయిన కుందూరు ఉదయ్ S/o లాలు అను అతనిని డబ్బులు ఇచ్చే విషయంలో, అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తులతో తిరుగుతున్నాడు అన్న ఉద్దేశంతో, అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అనగా 1.మిరియాల విక్రం రెడ్డి S/o నరసయ్య 2. వేల్పుల లింగరాజు S/o మల్సూర్ 3. కట్ల మహేష్ S/o ఉప్పయ్య లు దాడిచేసి పదునైన కత్తితో పొడవగా రక్త గాయాలైనటువంటి ఉదయ్, ప్రాణాపాయ స్థితిలో ఉండగా ఖమ్మం నగరంలో కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి, ICU లో చికిత్స చేయిస్తూ బుధవారం ఉదయం తన తండ్రి ఇచ్చిన పిటిషన్ మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై కూచిపూడి జగదీష్ జగదీష్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కుందూరు ఉదయ్ యొక్క స్టేట్ మెంట్ రికార్డ్ చేసి దాడి చేసిన ముగ్గురు వ్యక్తుల్ని బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టు నందు హాజరు పరిచినట్లు తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు


## పోలీసులకు 'డీజే-పంచాయతీ'.!

### పెట్రోలింగ్ సిబ్బందిపై దాడి - నలుగురిపై కేసు నమోదు

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలో రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై దాడి జరిగిన ఘటనలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఎం. చిరంజీవి తెలిపారు. మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో కోరుట్ల హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి, కానిస్టేబుల్ గంగాధర్ పట్టణంలో పెట్రోలింగ్ చేస్తుండగా భీముని దుబ్బ సమీపంలో కొంతమంది వ్యక్తులు డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి డాన్స్‌లు చేస్తున్నారనే సమాచారం అందింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీజే ఆఫ్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయితే సూచనలు పట్టించుకోకుండా వారు డాన్స్ కొనసాగించారని తెలిపారు. ఈ క్రమంలో హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి సంఘటనను తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, కోరుట్లకు చెందిన గడల విజయ్, డీజే రమేష్, దినకర్, మహేందర్ అనే వ్యక్తులు ఆయన ఫోన్ లాక్కొని కింద పడేశారని పేర్కొన్నారు. ఫోన్‌ను తిరిగి తీసుకునేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్ గంగాధర్‌ను కాలర్ పట్టుకుని నెట్టివేసి విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ లింబాద్రి ఫిర్యాదు మేరకు పై నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ఎం. చిరంజీవి వెల్లడించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించారు.

## తొగుటలో హోలీ సంబరాలు





**నేటి సాక్షి తొగుట.. (వడ్డే నరసింహులు):** తొగుట మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలలో యువత, పిల్లలు హోలీ సంబరాలలో సంతోషంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అంటారని పిల్లలు మంచి మార్గంలో నడిచి భవిష్యత్తులో గొప్ప గొప్ప స్థాయిలో ఎదగాలంటే వారికి బాల్య దశ నుండే సాంస్కృతి, సాంప్రదాయాలు, నైతిక విలువలు నేర్పించాలని ఆ బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పైన ఉంటుందని తెలిపారు. మన సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు యువతకు నేర్పిస్తూ కష్టపడి చదివే తత్వాన్ని ఏర్పరచాలని సూచించారు. హోలీ పండుగ సందర్భంగా అందరం కలిసి ఉల్లాసంగా రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపమన్నారు.